ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | శనివారం | 17.01.2026 | సంపుటి : 1 | సంచిక : 200 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



06

## ఈసారి బుల్లెట్ మిస్ కాదు

ట్రంప్‌పై ఇరాన్ బెదిరింపులు



06

## కదిలే కారులోకి దూకిన అడవి జంతువు

తల్లి ఒడిలోని చిన్నారి మృతి



04

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



04

## ఇంక్‌కు బదులు మార్కర్ పెన్ను ఉపయోగం

మహారాష్ట్రలో ఇసి తీరుపై మండిపడ్డ రాహుల్

ఇది ముమ్మాటికీ ఓట్ చోరీ అంటూ ఆగ్రహం

# అభివృద్ధి కోసమే నా ఆరాటం

బాసర ఐఐటిలో క్యాంపస్ ఏర్పాటు చేస్తాం

నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు

ఆదిలాబాద్ విమానాశ్రయానికి ప్రధానితో శంకుస్థాపన

## ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ మంజూరు

పనుల కోసమే ప్రధాని మోడీతో భేటీ అవుతూనే ఉంటా

తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి తీరుతాం

కెసిఆర్ అప్పలతో తెలంగాణ కుప్పయ్యింది

అభివృద్ధి కోసం ఆశీర్వదించండి.. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి

నిర్మల్ బహిరంగ సభలో సిఎం రేవంత్ పిలుపు



**పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అంటూ.. జల్, జంగల్, జమీన్ అంటూ కుమురం భీం కొట్లాడారని అన్నారు.**

నిర్మల్, జనవరి 16 : ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం. ఎయిర్-పోర్టు కోసం 10వేల ఎకరాల

-.మిగతా 2 లో..

# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన

## ఇప్పటికే 70వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

02

గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మందికి నియామక పత్రాలు

నిరుద్యోగులతో ఆడుకున్న గత బిఆర్ఎస్ ప్రభుత్వం

కోర్టు కేసులతో నియామకాలను అడ్డుకునే యత్నాలు

వారి ఉద్యోగాలు పోవడంతోనే మీకు ఉద్యోగాలు

నియామక పత్రాలు అందించిన సిఎం రేవంత్ రెడ్డి



# ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

## స్పీకర్‌కు మరో రెండు వారాల గడువు

విచారణ సందర్భంగా సుప్రీం వెల్లడి

**బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాల తరువాత ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన పక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే నాలుగు వారాల సమయం కావాలని స్పీకర్ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి న్యాయస్థానాన్ని కోరారు.**

న్యూఢిల్లీ, జనవరి 16 : ఈ కేసులో పురోగతిని పరిశీలించి అవసరమైతే మరో రెండు వారాల గడువు పెంచుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. శుక్రవారం ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి కొంత సమయం కావాలని స్పీకర్ తరపు న్యాయవాది కోరారు. స్పీకర్‌కు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఆస్పత్రిలో ఉన్నారని, కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వచ్చినందున పక్రియ

-మిగతా 2 లో..

# ధరణి, భూభారతి కుంభకోణంలో 15మంది అరెస్ట్

## నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం

మరో 9 మంది పరారీలో ఉన్నట్టు పోలీసుల వెల్లడి

**తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి.**




వరంగల్, జనవరి 16 : రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు. నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం

-మిగతా 2 లో..



# రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన

వానాకాలం సీజన్‌లో కందుల కొనుగోళ్లు

లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 16 : రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన

-మిగతా 2 లో..

# మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం


ఎల్ అండ్ టి నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి సభ్యులతో కమిటీ

సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ

హైదరాబాద్, జనవరి 16 : హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ముందుగా మెట్రో

-మిగతా 2 లో..





## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 156 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 183 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 265 (కిలో) |
| స్కిన్ లెస్ | 302 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

# వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

నిధులు కేటాయించి పనులు ప్రారంభం

విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయం సందర్శన

గత కెసిఆర్ ప్రభుత్వం వేములవాడను విస్మరించింది

రాజన్న ఆలయ సందర్శనలో మంత్రి సీతక్క



వేములవాడ, జనవరి 16 : వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆలయంలో

-మిగతా 2 లో..



# తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించిన మంత్రి జూపల్లి

తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఈ షో జరుగనుంది. తెలంగాణ పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హాట్ ఎయిర్ బెలూన్ షోను ప్రారంభించారు.

02

# 18న ఖమ్మం జిల్లాలో సిఎం పర్యటన

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి



ఖమ్మం, జనవరి 16 :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన వివరాలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం

-మిగతా 2 లో..

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..



## 18న ఖమ్మం జిల్లాలో సీఎం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

మద్దులపల్లిలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు మంత్రి పొంగులేటి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. అదే రోజున పాలేరు నియోజకవర్గంలోనూ పర్యటిస్తారని మంత్రి పేర్కొన్నారు. మద్దులపల్లిలో జేఎన్టీయూ ఫౌండేషన్, నర్సింగ్ కాలేజ్, మున్నేరు - పాలేరు లింక్ కెనాల్, కూసుమంచిలో 100 పడకల ఆస్పత్రి, మార్కెట్ యార్డ్ ప్రారంభం సహా ఎన్నో కార్యక్రమాలను సీఎం ప్రారంభిస్తారని పొంగులేటి చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రితో పాటు అదే సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి పాల్గొంటారని తెలిపారు. మొత్తం రూ.362 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని పొంగులేటి వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నాహక సమావేశం కూడా ఇక్కడే జరుగుతుందని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సీఎం మాట్లాడతారని మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడే తాము ప్రజల్లో తిరగడం లేదని.. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నామని పొంగులేటి స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలా ఎన్నికలప్పుడు బొమ్మ చూపెట్టే ప్రభుత్వం కాదని.. తమ సర్కార్ ప్రజా శ్రేయస్సు కోసం పని చేసేదని వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ హైదరాబాద్‌లో తప్ప బయట ఎక్కడా కేబినెట్ సమావేశం జరగలేదని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ నెల 18న మొట్టమొదటిసారిగా మేడారంలో కేబినెట్ మీటింగ్ జరగనుందన్నారు. కాకతీయుల నాటి రాతి కట్టడాలను తమ ప్రభుత్వం మేడారంలో ఏర్పాటు చేసిందని చెప్పుకొచ్చారు. ఆరోజు ఉదయం కొత్తగా ఏర్పాటుచేసిన రాతి కట్టడాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అన్నారు. కుంభమేళా కంటే అద్భుతంగా మేడారం జాతర ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. గడువు పూర్తయిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన

(మొదటిపేజీ తరువాయి)

ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఓ-ూఖ కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల. వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓ-ూఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన. వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.



## వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడిపడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారం ఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీతక్క తెలిపారు. కేసీఆర్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తోందని వ్యాఖ్యానించారామె. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. బీఆర్ఎస్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. మేడారం సమ్మక్క - సారక్క, వేములవాడ ఆలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలోనే నిధులు కేటాయించారని ప్రస్తావించారు మంత్రి. సమ్మక్క - సారలమ్మ చరిత్ర, ప్రత్యేకతను శిలలపై రాయిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో రాజన్నను దర్శించుకుంటే నష్టం అంటూ దుష్ప్రచారాలు చేశారని అన్నారు. వేములవాడ రాజన్నను ఎంతోమంది భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారని తెలిపారు సీతక్క. ప్రస్తుతం.. వేములవాడకు భారీగా భక్తులు తరలివచ్చి రాజన్నకు మొక్కులు సమర్పిస్తుంటారని పేర్కొన్నారు. రాజన్నపై నమ్మకంతోనే ఇంతమంది భక్తులు ఆలయానికి వస్తున్నారని వెల్లడించారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా స్వామివారిని భక్తులు కొలుస్తుంటారని తెలిపారు. తెలంగాణ సార్వత్రిక ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను వేములవాడ రాజన్నను దర్శించుకున్నామని గుర్తుచేశారు. అలాగే, మేడారం సమ్మక్క - సారక్క అమ్మవార్ల నుంచి పాదయాత్ర ప్రారంభించామని తెలిపారు. ఏ దేవాలయాల ప్రత్యేకత వాటికి ఉంటుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# అభివృద్ధి కోసమే నా ఆరాటం

(మొదటిపేజీ తరువాయి)



ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళ్తున్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను.. పర్సనల్ ఎంజెడా లేదు.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తానని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగిందని పరోక్షంగా కెసిఆర్ తీరుపై మండిపడ్డారు.. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందన్నారు. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని కెసిఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. భూసేకరణకు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు వర్శిటీ లేదని.. ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలో వర్సిటీ మంజూరు అవుతుందన్నారు. బాసర వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామని.. దానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదిలాబాద్ వర్సిటీ బాసరలో ఏర్పాటు చేస్తున్నామని.. ఉమ్మడి జిల్లా కు కావాల్సిన నిధులను బ్జడెట్ లో ప్రవేశ పెట్టుతామన్నారు.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాణహిత చేవెళ్ల పై నివేదిక తయారు చేస్తున్నామని.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కని ఓడి పట్టుతామన్నారు.. ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మోడీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు శిలాఫలకం వేయిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు వచ్చాక రాజకీయం.. ఎన్నికల తర్వాత అభివృద్ధికి కలిసి నడుద్దామన్నారు. ప్రతి మూడు నెలలకు సారి కేంద్రాన్ని కలుస్తాం.. మీరు సైతం నా దగ్గరకు రండి.. సాధ్యం అయినంత పనులు చేస్తామని ప్రతిపక్ష నేతలకు సీఎం తెలిపారు. మోడీ నాకు చుట్టం కాదు దేశానికి ప్రధాని కాబట్టి మన ప్రాంతం అభివృద్ధి కావాలి కాబట్టి మోడీని కలుస్తున్నానని చెప్పారు. ప్రాంత అభివృద్ధి కోసం ఎవ్వెర్నినా కలుస్తా. పైరవీలు లేవు, పర్సనల్ పనులు నాకు లేవని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఇస్తాం అని చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ఇవ్వన్నీ అడిగనిదే ఇవ్వరు. గత పాలకులు అడగకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. వాళ్ల తప్పులకు ఇప్పుడు అప్పులు మిగిలాయి. ఆ ప్రభుత్వంలో ఇచ్చిన బియ్యం ఎవ్వరైనా తిన్నారా..? కాని మేము ఇచ్చే సన్న బియ్యం తింటున్నారు. నాడు పావలా వడ్డీ లేదు సున్నా వడ్డీ లేదు.. గుండు సున్నా మిగిల్చారు. వెయ్యికోట్ల భూమి మహిళలకు కేటాయించాం.. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి వల్ల క్రమక్రమంగా అభివృద్ధి చేసుకుందాం.. రాష్ట్ర ప్రజలు అండగా నిలవండి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతా.. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి? ప్రజా ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపించండి.. కేవలం ఎన్నికల అప్పుడే రాజకీయాలు, అభివృద్ధికి అందరం ఒకటే..' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన

**హైదరాబాద్, జనవరి 16:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రాణ త్యాగాలతో సాధించుకున్నామని.. కానీ బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ పాలకులు ఆడుకున్నారని మండిపడ్డారు. ఈ పాలనలో వారు.. వారి స్వప్రయోజనాలే చూసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఓపిక నశించిన యువత.. కేసీఆర్‌ను ఇంటికే పరిమితం చేశారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. శుక్రవారం శిల్పకళా వేదికలో కొలువుల పండగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి.. గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలకుల ఉద్యోగాలు పోతేనే మీకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వకూడదని కోర్టుల్లో కేసులూ వేశారన్నారు. అన్ని అవరోధాలు అధిగమించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్ 1 నియమకాలు చేపట్టలేదన్నారు. గతంలో నియామక పరీక్షలు కూడా సరిగా నిర్వహించ లేదని గుర్తు చేశారు. నిరుద్యోగులు తమ విలువైన సమయం కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేశామన్నారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించామని తెలిపారు. ఇప్పటి వరకు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. గతంలో అర్హత లేనివారికి టీజీపీఎస్సీలో కీలక ఉద్యోగాలు ఇచ్చారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై సీఎం రేవంత్ నిప్పులు చేశారు. గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు ఊడగొట్టి.. తమకు ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని యువత తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వివిధ శాఖల్లో గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందజేశారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేదని, పోటీ పరీక్షలు నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. పేపర్లు లీకవ్వడం, మళ్లీ పరీక్షలు నిర్వహించడం మరో బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీశారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించాం. గ్రూప్-1 నియామకపత్రాలు ఇచ్చే సమయంలో కూడా కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60వేల ఉద్యోగ నియామకపత్రాలు అందించాం. ఉద్యోగాలు ఇవ్వడం మాకు బాధ్యత.. మీకు జీవితం. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతం తీసుకోవడం కాదు.. ఒక భావోద్వేగం. అందరికీ విద్య అందుతుంది.. కానీ, నాణ్యమైన విద్య అందడం లేదు. ప్రైవేటు పాఠశాలల మీద ప్రజలకు ఎందుకు విశ్వాసం పెరిగింది? లక్షల మంది ఇంజినీరింగ్ చేసి బయటకు వస్తున్నా.. అందరికీ ఎందుకు ఉద్యోగాలు రావట్లేదు? జాబ్ మార్కెట్‌లో అవకాశాలు ఉన్నా స్కిల్ లేక అందుకోలేకపోతున్నాం. నైపుణ్యాభివృద్ధి కోసం మీరు ప్రయత్నించాలి. ఒకప్పుడు పేదరికం పోగొట్టడానికి భూములు ఇచ్చే వాళ్లం. ఇప్పుడు ఇవ్వడానికి భూములు లేవు.. నాణ్యమైన విద్యను మాత్రమే అందించగలం. విద్య ఒక్కటే పేదరికాన్ని పోగొడుతుంది. కులం, డబ్బు, అధికారంతో కాదు.. విద్యతోనే గౌరవం వస్తుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలి. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తా.. రాజకీయపార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దు. ఎవరూ మనకు చెప్పాల్సిన అవసరం లేదు.. నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ప్రభుత్వంలోనే కాదు.. ప్రవేటు రంగంలో కూడా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి ప్రపంచంతోనే పోటీ పడే విధంగా యువతను తీర్చి దిద్దే బాధ్యత నాదని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి తదిరులు పాల్గొన్నారు.

## ధరణి, భూభారతి కుంభకోణంలో 15మంది అరెస్ట్

చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి- భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని సీపీ తెలిపారు. మొత్తం మూడు కోట్ల 72 లక్షల రూపాయల కుంభకోణం జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణం కేసులో కీలక ఆధారాలు సేకరించారు పోలీసులు.



## మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం

(మొదటిపేజీ తరువాయి)

మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.




## తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న 300 మంది సందర్శకులకు హాట్ ఎయిర్ బెలూన్లలో రైడ్‌కు అనుమతి ఇవ్వనున్నారు. అలాగే సాధారణ ప్రేక్షకులకు నైట్ గ్లో షో ఓపెన్‌గా ఉండనుంది. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. వయస్సు, రైడ్ రకాన్ని బట్టి ధరలు రూ.500 నుంచి రూ.1500 వరకు ఉండనున్నాయి. ఃూగా.. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సందర్భంగా జనవరి 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ / స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో సందర్శకులు కైట్ ఫెస్టివల్‌లో పాలుపంచుకున్నారు. అలాగే జనవరి 16, 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాద్‌లో తొలి హాట్ ఎయిర్ బెలూన్ ఈవెంట్‌గా రికార్డు సృష్టిస్తోంది. పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రంగురంగుల బెలూన్లు ఆకాశంలో కనువిందు చేయనున్నాయి.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

(మొదటిపేజీ తరువాయి)

భూమిని సేకరించాల్సి ఉందన్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ఆలస్యమైందని న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టుకు నివేదించారు. ఇప్పటివరకు స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ఆయన కోర్టుకు సమర్పించారు. మిగతా ముగ్గురు సభ్యులపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల సమయం కావాలని ధర్మాసనానికి స్పీకర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. త ఏడాదిగా ఇదే చెబుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో మూడు నెలల్లోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని పాడి కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, మిగిలిన ముగ్గురిపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టును కోరారు. అయితే రెండు వారాలు సమయం ఇస్తున్నామని.. రెండు వారాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాత అవసరం అయితే మరో రెండు వారాలు సమయం ఇస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం చెబుతూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యే లపై విచారణ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తరఫున అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం ప్రకటించారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహా రంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. స్పీకర్ తీసుకున్న చర్యలపై ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ నివేదిక అందించారు. అనంతరం తదుపరి విచారణ ను రెండు వారాలకు వాయిదా వేసింది.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..



# వైభవంగా కొత్తకొండ వీరభద్రస్వామి ఉత్సవాలు

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- బండ్లు కట్టి స్వామిని దర్శించుకున్న ప్రజలు
- పలువురు మంత్రులు రాక.. భారీ బందోబస్తు ఏర్పాటు





**హన్మకొండ, జనవరి 16 :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురు, శుక్రవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. కోరిన కోరికలు తీర్చాలని స్వామివారికి కోర మీసాలు సమర్పించుకున్నారు. తమ గండాలు తొలగిపోవాలని గండా దీపంలో నూనె పోశారు. వీరభద్రుని సన్నిధిలో కోడె ప్రదక్షిణ చేశారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ కట్టారు. భక్తులు అధికం కావడంతో శీఘ్ర దర్శనం, విఐపి క్యూలైన్లు సైతం కిక్కిరిసిపోయాయి. జాతరలోని దుకాణాలు, రంగులరాట్నం, సర్కస్ తదితర షాపులన్నీ రద్దీగా మారాయి. జాతరలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు వాటిల్లకుండా ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు పూర్తి సదుపాయాలు కల్పించారు. మకర సంక్రాంతి పర్వదినం గురువారం అర్ధరాత్రి ఆనవాయితీ ప్రకారం వరంగల్ జిల్లా వేలేరు కు చెందిన యాదవులు డబ్బు చప్పుళ్ళు, శివసత్తులు నృత్యాల మధ్య మేకల బండితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎడ్లబండ్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి గుట్టపైన కొలువుదీరిన వీరభద్ర స్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి. గుట్టపైకి వెళ్ళిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపైకి వెళ్లి ప్రకృతి రమణీయతను వీక్షించేందుకు యువత పోటీపడ్డారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర లోని అతని ఇంటి నుంచి కొత్త కొండకు ఎడ్ల బండి రథం మకర సంక్రాంతి రోజున వెళ్లడం అనవాయతీగా వస్తుంది. ఈ ఏడాది సైతం ఎడ్ల బండి రథాన్ని అందంగా అలంకరించారు. శివ సత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్ల బండి రథాన్ని కొత్తకొండకు గ్రామస్తులు అంగరంగ వైభవంగా సాగనంపారు. బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే చందంగా కొత్తపల్లి నుంచి కొత్తకొండకు వెళ్లిన ఎడ్లబండ్లు రథాలను తలపించాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం సుమారు 72 వరకు ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలంకరించి రథాలుగాతీర్చిదిద్దారు. కొత్తకొండ వరకు సాగిన ఎడ్ల బండి రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా ఎడ్ల బండ్లతో వచ్చి ఆలయ ప్రదక్షిణలు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మకర సంక్రాంతి పర్వదినాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు వారికి శేష వస్త్రాలు సమర్పించి స్వామి వారి మెమొంటోను ప్రధానం చేశారు. అంతకుముందు త్రిశూల చౌరస్తాను ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తకొండ ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, ఇతరత్ర అభివృద్ధి పనులకోసం రూ. 70 కోట్లు నిధులు మంజూరు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి మందులు పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా అంబులెన్స్ ను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు జాతరలో అగ్నిమాపక సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జూదం, మట్కా, గుట్కా, నాటుసారా లేకుండా పూర్తిస్థాయిలో పోలీసులు నియంత్రించారు. కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు ఏసీపీలు పదిమంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 350 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొని సేవలందించారు.

## సుప్రీం ఆదేశాలను ధిక్కరించిన స్పీకర్

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ధిక్కరణ కేసు
- అనర్హత ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన
- కేసు దాఖలు చేసిన తెలంగాణ బిజెపి నేత



**హైదరాబాద్, జనవరి 16 :** తెలంగాణ రాజకీయాల్లో సంచల నంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారి న ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జా ప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. సుప్రీం న్యా యస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొం టూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో తెలంగాణ భాజపా నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంలో పలువురు ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరికొందరిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టారు. దీంతో స్పీకర్‌పై భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు చెప్పినా.. ఆ సూచనను స్పీకర్ పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలను కూడా పిటిషన్‌లో పొందుపరిచారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదేశించింది. అయితే.. నిర్ణీత గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఇది న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడమే కాకుండా.. కావాలనే తన నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశాలు అమలు జరగలేదని... ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం, పార్టీ ఫిరాయింపులను చట్టబద్ధం చేసే పరిస్థితి వంటివి ఉన్నాయని పిటీషన్‌లో ప్రస్తావించింది బీజేపీ. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పష్టత లేకపోవడాన్ని స్పీకర్ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతోందో చూపిస్తున్నాయని బీజేపీ వాదిస్తోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉండేలా నిర్ణయాన్ని స్పీకర్ ఆలస్యం చేస్తున్నారని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అందుకే స్పీకర్ ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు ఏలేటి. ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఎలాంటి పరిణామాలు ఉండవనే భావన పెరుగుతుందని బీజేపీ తన పిటిషన్‌లో రాసుకొచ్చింది.ఇప్పుడీ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుతో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో.. న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

## బెంగాల్లో నేటి నుంచి మోడీ రెండ్రోజుల పర్యటన

### పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ప్రధాని



**కోల్‌కతా, జనవరి 16 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీఈనెల 17,18 తేదీల్లో పశ్చిమబెంగాల్లో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు రాజకీయ ర్యాలీల్లోనూ పాల్గొంటారు. ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ పక్రియ, టీఎంసీ రాజకీయ కన్సెల్టెన్సీ ఐ-ప్యాక్ పై ఇటీవల జరిగిన ఈడీ దాడులతో బెంగాల్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకోనుంది. శనివారం సాయంత్రం మాల్డాకు ప్రధాని చేరుకుంటారని, తొలుత ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆ తర్వాత సమీప గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే పబ్లిక్ ర్యాలీలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నేత ఒకరు తెలిపారు. ఆదివారం నాడు మరలా బెంగాల్ వచ్చి హుగ్లీలోని సింగూర్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ఆ వెంటనే పబ్లిక్ ర్యాలీకి హాజరవుతారని చెప్పారు. ఆ రాత్రి కోల్‌కతాలోనే బస చేస్తారా అనేది మాత్రం వెల్లడించలేదు. పీఐబీ ప్రకటన ప్రకారం.. ప్రధాని జనవరి 17వ తేదీ మధ్యాహ్నం 12:45 గంటలకు మాల్డా చేరుకుంటారు. హౌరా-గౌహతి మధ్య నడిచే తొలి వందేభారత్ స్లీపర్ ట్రైన్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. ఆదివారం నాడు హుగ్లీ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తారు. ఎస్ఐఆర్ పేరుతో సాధారణ పౌరులను బీజేపీ, ఎన్నికల కమిషన్ వేధిస్తోందని.. దీనికి బ్యాలెట్ బాక్స్ వద్దే ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాలని అధికార టీఎంసీ కొద్దిరోజులుగా విమర్శలు గుప్పిస్తోంది. అయితే.. ఈ వాదనలను బీజేపీ తోసిపుచ్చుతోంది. అక్రమ వలసదారులు, రోహింగ్యాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఎస్ఐఆర్ తప్పనిసరని, గణనీయంగా తమ ఓటు బ్యాంకు కోల్పోతోందనే అక్కసుతోనే టీఎంసీ తప్పుడు ఆరోపణలను చేస్తోందని చెబుతోంది.

## గాదె ఇన్నయ్యకు తాత్కాలిక బెయిల్ మంజూరు

**హైదరాబాద్:** ఉపా చట్టం కింద అరెస్టయి.. జైల్లో ఉన్న సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యకు ఎన్ఐఏ కోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ఆయన తల్లి థెరిస్సమ్మ మృతి చెందడంతో 48 గంటల పాటు షరతులతో కూడిన ఎస్కార్ట్ బెయిల్ ఇచ్చింది. ఇన్నయ్య స్వస్థలం జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలంలో శనివారం థెరిస్సమ్మ అంత్యక్రియలు జరగనున్నాయి. కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఆదివారం రాత్రికల్లా తిరిగి జైలుకు రావాలని కోర్టు ఆదేశించింది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు నేత కాటా రాంచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. వికల్ప్ అంత్యక్రియలకు హాజరైన గాదె ఇన్నయ్య ప్రసంగం మావోయిస్టులకు అనుకూలంగా ఉందని, ఉద్యమాన్ని ఉత్తేజపరిచే విధంగా ఉందని ఎన్ఐఏ భావించింది. ప్రజలు మావోయిస్టు భావజాలం వైపు ఆకర్షితులయ్యేలా ఇన్నయ్య ప్రసంగం ఉందని ఆరోపిస్తూ.. ఎన్ఐఏ ఆయనపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి డిసెంబర్ 21న అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## సంక్రాంతి వేళ దొంగల హల్‌చల్

### చెంగిచెర్లలో పలు ఇళ్లల్లో భారీ చోరీ

**హైదరాబాద్, జనవరి 16 :** హైదరాబాద్ నగర శివారులోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగల ముఠా హల్‌చల్ చేసింది. సంక్రాంతి పండుగ సమయంలో చెంగిచెర్ల కాలనీలో గుర్తు తెలియని దొంగల ముఠా పలు ఇళ్లలోకి చొరబడి భారీ చోరీలకు పాల్పడింది. తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో దొంగల ముఠా చేతిలో కత్తులు, ఇతర ఆయుధాలతో చెంగిచెర్ల కాలనీలో సంచరించింది. ముందుగానే రెక్కీ చేసుకుని, కారులో వచ్చిన ఈ ముఠా దాదాపు 12 ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకుంది. వరుసగా ఇళ్లల్లో చోరీకి తెగబడ్డ దుండగులు ఆపై అక్కడి నుంచి పరారయ్యారు. తమ ఇళ్లలో దొంగతనం జరిగినట్లు గుర్తించిన బాధితులు వెంటనే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో కలిసి ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పండుగ సమయంలో చాలా మంది స్వస్థలాలకు వెళ్లిపోవడంతో ఇళ్లు ఖాళీగా ఉండటాన్ని అదునుగా భావించి దొంగలు ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. కాగా.. సంక్రాంతి సమయంలో స్వగ్రామలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని, పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, సీసీటీవీలు, అలారం సిస్టమ్స్ ఏర్పా టు చేసుకోవాలని పోలీసులు సూచనలు చేశారు. త్వర లోనే దొంగల ముఠాను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## పోచారం ఇంకా బిఆర్ఎస్‌లోనే ఉన్నాడని అంటారా?

- స్పీకర్ తీరు చట్టసభలను అగౌరవ పరిచేలా ఉంది
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆగ్రహం

**నిజామాబాద్, జనవరి 16 :** చట్టసభల గౌరవాన్ని హక్కులను రక్షించాల్సిన అసెంబ్లీ స్పీకర్ భక్షకుడుగా మారడం శోచనీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు , మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. స్పీకర్ జడ్జిమెంట్ రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని, పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పునివ్వడం రాష్ట్ర చట్టసభల గౌరవాన్ని దిగజార్చిందని అన్నారు. నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ ఫిరాయింపు చేసినప్పటికీ, అనర్హత వేటు వేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా మారిందని అభిప్రాయ పడ్డారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం స్పష్టంగా ఉన్నా, దాన్ని అమలు చేయడంలో స్పీకర్ నిర్లక్ష్యం, ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి అవలంబిస్తున్న ఈ అనైతిక రాజకీయ విధానం ప్రజలు ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని దుయ్యబట్టారు.

## ఇందూరును నిజామాబాద్‌గా మార్చారు

- మళ్లీ తిరిగి ఇందూరుగా మార్చి తీరుతాం
- ఇక్కడ కాషాయ జెండా ఎగరేసి తీర్మానిస్తాం
- రాముడికి బిజెపి సభ్యత్వం ఉందంటూ ఎంపి అరవింద్ వ్యాఖ్య



**నిజామాబాద్, జనవరి 16 :** నిజామాబాద్‌ని ఇందూర్‌గా పేర్కొన్న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆ పేరు ఎలా వచ్చిందో చారిత్రిక ఆధారాలు ఉన్నాయన్నారు. మీడియాలో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజాం ఒక హంతకుడు.. నిజామాబాద్‌కి ఆయన పేరు ఎందుకు పెట్టుకుంటారన్నారు. ఇందూర్‌గా పేరు మార్చి ఆ తీర్మానాన్ని ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి పంపిస్తామన్నారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు తెలిపారు. ముస్లిం అంటే కాంగ్రెస్ అంటున్నారు.. మీ పార్టీకి సున్తీ అయిందా పోయి చూసుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో హిందువులా? ముస్లింలా? అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అన్నారు. కొంత మంది హిందువుల్లో చెడ పుట్టారన్నారు. తెలంగాణ మొత్తం కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో కవితను అడిగితే చెబుతుందన్నారు.. రేపు సిరిసిల్లలో కూడా చూపిస్తామన్నారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అని కేటీఆర్‌కి సవాల్ విసిరారు. చెన్నారెడ్డి సీఎంగా రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో మత ఘర్షణలు జరిగాయని ఎంపీ అరవింద్ తెలిపారు. గొడవల కు కారణం కాంగ్రెస్.. అప్పట్లో సత్తయ్య ఏసీపీని చంపితే ఆ నిందితులను బయటకు తెచ్చింది మజ్లిస్.. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాల మీద పడుతున్నారు.. దీనికి కారణం రేవంత్ రెడ్డి.. ఇచ్చేది దొంగ వాగ్దానాలు.. హిందూ దేవుళ్ళ మీద ఓట్లు.. గులాంలుగా మారి పోయి హిందువులను తాకట్టు పెడుతున్నారు.. నూటికి నూరు శాతం ఇందూర్ కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం.. నిజామాబాద్ పేరును ఇందూర్‌గా మారుస్తాం? తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం.. నిజాంను ఒకే సారి నేను గాడిద అని ఒక్కసారి అంటే దానిపై రాద్ధాంతం చేస్తున్నారు.. నిజాం చరిత్రలో దుర్మార్గమైన రాజు గానే మిగిలి పోతారు.. ఆయన పేరు చెబితే హిందువులకు గుర్తుకు వచ్చేది అయన చేసిన మారణకాండనే.. ముస్లింలకు అవాస్ యోజన కింద ఇల్లు, ఫ్రీ రేషన్, ఫ్రీ వాక్సినేషన్ మోడీ ఇస్తున్నారు.. ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్ పంపించారు.. మీ పిల్లలకు విద్యా, వైద్యం ఇస్తుంది.. నిజాం అంత వెనుకోసుకొస్తున్నా.. రేవంత్ రెడ్డి ఏం చేశారని ఓట్లు వేస్తున్నారు.. ఇన్ని చేసినా మోడీకి ఎందుకు వేయడం లేదు.. ఇదేనా మీ ఇమాందారీ..అని ఎంపీ వ్యాఖ్యానించారు.



## హోరాహోరీగా కోడి పందాలు

### రూ.1కోటి 53 లక్షల భారీ పందెం

**భీమవం, జనవరి 16 :** సంక్రాంతి సందర్భంగా గోదావరి జిల్లాల్లో కోడి పందాలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో రెండో రోజు నిర్వహించిన కోడి పందాలు భారీగా సాగాయి. లక్షలాది రూపాయలు పందాల్లో పెట్టగా, కోట్ల రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. తాడేపల్లిగూడెంలోని పైబోయిన వెంకటరామయ్య బరిలో నిర్వహించిన కోడి పందెంలో ఏకంగా రూ.1 కోటి 53 లక్షల భారీ పందెం కుదిరింది. ఈ పందెం గుడివాడ ప్రభాకర్ సేతువ మరియు రాజమండ్రికి చెందిన రమేష్ డేగ మధ్య జరిగింది. హోరాహోరీగా సాగిన పోటీలో చివరకు రాజమండ్రి రమేష్ డేగ విజయం సాధించింది. ఈ భారీ పందెన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు పందెం రాయుళ్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా పందెం ప్రేమికులు భారీగా వచ్చారు. దీంతో బరులు కిటకిటలాడాయి. సంక్రాంతి కోడిపందాలు గోదావరి జిల్లాల్లో సంప్రదాయంగా నిర్వహించబడుతుండగా, ఈ ఏడాది మరింత ఉత్సాహంగా సాగుతున్నాయి. పందాల్లో వేలాది కోళ్లు నేలకొరగగా, కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. పందెం రాయుళ్లు భారీ మొత్తాల్లో పందాలు కడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీసుల నిఘా ఉన్నప్పటికీ, కోడిపందాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నట్లు సమాచారం. మొత్తం మీద సంక్రాంతి పండుగ వాతావరణంలో కోడి పందాలు గోదావరి జిల్లాల్లో ప్రధాన ఆకర్షణగా మారాయి.



## 299లకే మేడారం ప్రసాదం

### తెలంగాణ ఆర్టీసీ వినూత్న సేవ

**ములుగు, జనవరి 16 :** ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన 'సమ్మక్క సారలమ్మ జాతర' ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు జరగనుంది. ములుగు జిల్లాలోని మేడారంలోలో కొలువైన వనదేవతలకు బంగారం సమర్పించుకునేందుకు తండోపతండాలుగా భక్తజనం తరలివస్తారు. ఈ నేపథ్యంలో భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవల్ని ప్రారంభించింది. మేడారంలో అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించడం ఆనవాయితీ. భక్తులు ఈ బంగారాన్ని పరమపవిత్రంగా భావిస్తారు. అయితే.. వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేకపోయిన భక్తులకు టీజీఎస్ ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. అలాంటి వారికి అమ్మవారి బంగారం ప్రసాదాన్ని తమ ఇంటి వద్దకే చేర్చేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.299 చెల్లిస్తే చాలు వద్దకే మేడారం అమ్మవార్ల ప్రసాదాన్ని తీసుకొచ్చి ఇవ్వనుంది. దేవాదాయ శాఖ సహకారంతో మేడారం అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని ఇంటి వద్దకే పంపించాలని టీజీఎస్ ఆర్టీసీ భావించింది. ఈ ప్రసాదం ప్యాకెట్‌లో సమ్మక్క, సారలమ్మ దేవతల ఫోటోతో సహా బెల్లం, పసుపు కుంకుమ వంటివి ఉంటాయి. ఈ గారం ప్రసాదం ప్యాకెట్ పొందాలనుకునే భక్తులు కేవలం రూ.299/- చెల్లించాల్సి ఉంటుంది. తమ సమీపంలోని టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్లు 040-69440069, 040-23450033 నంబర్లలో సంప్రదించవచ్చు అని టీజీఎస్ ఆర్టీసీ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు!




**మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్ మరోమారు బడ్జెట్ కసరత్తులో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవుఉల హాజరై తమ అసవరాలను, ఆకాంక్షలను వెల్లడంచారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా..ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దివఘూ చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి.**

బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆదారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆరెస్పీకి జాతీయ హోదా ,ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బ్జడెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి.

అలాగే ఎపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.

# ఇంక్‌కు బదులు మార్కర్ పెన్ను ఉపయోగం

- మహారాష్ట్రలో ఎన్నికల సంఘం తీరుపై మండిపడ్డ రాహుల్
- ఇది ముమ్మాటికీ ఓట్ చోరీ అంటూ ఆగ్రహం



**ముంబై, జనవరి 16 :** మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో చెరగని సిరాకు బదులుగా మార్కర్ పెన్‌లు ఉపయోగించడంపై రాజకీయ దుమారం రేగుతోంది. దీనిపై ఇప్పటికే విపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలిపాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శుక్రవారంనాడు దీనిపై మరింత ఘాటుగా స్పందించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యను తప్పుపట్టారు. పౌరులను తప్పుదారి పట్టిస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు కారణంగానే మన ప్రజాస్వామ్యంపై నమ్మకం సన్నగిల్లు తోందన్నారు. అంశంపై విపక్షాలు లేవనెత్తిన ఆందోళనలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని కుండబద్ధలు కొట్టారు. 'ప్రజలను గ్యాస్‌లైటింగ్ చేస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తోంది. ఓటు చోరీ దేశద్రోహ చర్య' అని రాహుల్ తప్పుపట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో చెరగని సిరాకు బదులుగా మార్కర్ పెన్ వాడారని, ఇందువల్ల ఓటర్ల చేతికి వేసిన ముద్రను తేలిగ్గా చెరిపివేసేందుకు వీలుంటుందని, ఇది బోగస్ ఓట్లకు దారితీస్తుందని పలు విపక్ష పార్టీలు గురువారంనాడు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించింది. మార్కర్ పెన్‌లలో వినియోగించిన చెరగని సిరా నాణ్యతపై విచారణ జరుపుతామని తెలిపింది. 'ఇంకును ఓటింగ్ సమయంలో వేలిపై వేశారా, లేక ఇది ఆకతాయిల చర్యా అనేది తెలుసుకునేందుకు వీడియోలను పరిశీలిస్తాం' అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దినేష్ వాఘ్‌మారే చెప్పారు. వివాదం నేపథ్యంలో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికల్లో మార్కర్ పెన్‌లను వాడేది లేదని, తిరిగి చెరగని సిరాను మాత్రమే వాడతామని చెప్పారు. కాగా, ప్రజలను గ్యాస్‌లైటింగ్ చేస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందనీ, ఓటు చోరీ దేశద్రోహ చర్య అనీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించే ఆయన సాకులు వెతుక్కుంటున్నారని పేర్కొంది.

# నీరవ్ మోడీ కేసులో ఈడీ దర్యాప్తు

- ఛోక్సీ తనయుడు రోహన్‌కు కూడా సంబధం
- ఢిల్లీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఈడీ వివరాలు



**న్యూఢిల్లీ, జనవరి 16 :** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్ చోక్సీకి కూడా సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పీలేట్ ట్రైబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని.. ఈ కంపెనీ నిధులను వారు విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులను అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రోహన్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించడానికి ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్‌లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్‌కు తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

# మరోమారు పాక్ కవ్వింపు చర్యలు

**సరిహద్దుల్లో డ్రోన్లతో దాడి చేసే యత్నం**

**న్యూఢిల్లీ, జనవరి 16 :** ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తాం అంటూనే.. పాకిస్థాన్ మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీ-డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు. పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ దాటి భారత భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

# కన్యాకుమారిలో రోడ్డు ప్రమాదం

**లక్సెట్టిపేటకు చెందిన దంపుతల దుర్మరణం**

**మంచిర్యాల, జనవరి 16 :** తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మరణించారు. అయ్యప్ప మాల ధరించిన వారు.. శబరిమలకు వెళ్తొస్తుండగా ఈ దారుణం జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన ఈ దంపతులు జనవరి 8వ తేదీన ఓ ప్రైవేటు సర్వీస్‌లో శబరిమల దర్శనానికి వెళ్లారు. జనవరి 15వ తేదీన మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కన్యాకుమారి సమీపంలో బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం చేసుకుని దేవాలయాలు సందర్శించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా వారికి ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు.మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కన్యాకుమారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మద్యం సేవిస్తూ అన్నదమ్ముల గొడవ

**పై అంతస్తు నుంచి తోసి అన్నను చంపిన తమ్ముడు**

**హైదరాబాద్, జనవరి 16 :** పండగ పూట హైదరాబాద్ నాచారంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం సేవించే క్రమంలో జరిగిన చిన్న గొడవ అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. మద్యం గ్లాస్ విషయంలో మొదలైన వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో తమ్ముడు అన్నపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కోపోద్రిక్తుడైన తమ్ముడు అన్నను మూడో అంతస్తుపై నుంచి తోసేయడంతో అన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా.. మర్గమధ్యంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న నాచారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు స్టీఫెర్డ్ రోహన్ సాయర్స్ (30), నిందితుడు లేనర్డ్ లయనెల్ సాయర్స్ (28)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనకు కారణమైన తమ్ముడు సాయర్స్‌ని పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

# బృహన్ ముంబై మున్సిపల్ ఎన్నికలు

**బిజెపి నేతృత్వంలోని కూటమికే ఆధిక్యం**

**ప్రభావం చూపలేక పోయిన ఠాక్రే సోదరులు**

**ముంబై, జనవరి 16 :** ఠాక్రే బ్రదర్స్ కలిసినా, కలిసి పోటీ చేసినా ముంబై మున్సిపల్ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బిజెపి, ఏక్‌నాథ్ షిండే శివసేనల కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. ఈ ఎన్నికల్లో భాజపా-శివసేన కూటమి బలీయంగా ఆవిర్భవించింది. గుజరాతీయులు, తమిళులపై ఠాక్రే సోదరుల విమర్శలు పలు వర్గాల్లో భయం కలిగించాయి. దీంతో ఆయా వర్గాలు భాజపాకు ఓటు వేసినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల సరళిని బట్టి చూస్తే శివసేన (యూబీటీ) వర్గం మళ్లీ గర్జించే పరిస్థితి లేదని చెప్పవచ్చు. ఒకప్పుడు ఠాక్రేలు ముంబయి మహానగరాన్ని కనుసైగలతో శాసించిన పరిస్థితి నుంచి తెరమరుగు కావడం రాజకీయ స్వయంకృతమే. ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేనకు ముంబయి మహానగరం కీలకమైనది. దశాబ్దాల క్రితం ఇక్కడే బాల్‌ఠాక్రే సారథ్యంలో శివసేన ఆవిర్భవించింది. అనంతరం దేశ ఆర్థిక రాజధానిపై వారి హవానే కొనసాగింది. అయితే తాజా ఎన్నికల్లో ఉద్ధవ్‌కు ఆయన సోదరుడు రాజ్ అండగా నిలిచినా .. విజయం అందుకోలేక చతికిలపడింది. భాజపా-శివసేన కూటమి ఘనవిజయం సాధించింది. ప్రస్తుత ఫలితాల సరళి ప్రకారం.. బీఎంసీలోని 227 వార్డుల్లో భాజపా, శివసేనలతో కూడిన మహాయుతి కూటమి 116 వార్డుల్లో ముందంజలో ఉంది. శివసేన (యూబీటీ) కూటమి 85 వార్డుల్లో ఆధిక్యం సాధించింది. బాల్‌ఠాక్రే ఉన్న సమయంలో భాజపాతో సత్సంబంధాలు ఉండేవి. ఉద్ధవ్ పగ్గాలు చేపట్టిన అనంతరం రెండు పక్షాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి.




# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**ముంబై, జనవరి 16 :** భారతీయులకు బంగారానికి విడదీ-యరాని అనుబంధం ఉంది. బంగారం అంటే ఇష్టపడని భారతీయుడు ఉండడంటే అతిశయోక్తికాదు. ఏ శుభకార్యం జరిగినా కూడా బంగారు ఆభరణాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఏడాది క్రితం లక్ష రూపాయలకు దిగువన ఉన్న బంగారం ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి. ప్రస్తుతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,43,620 దగ్గర ట్రేడ్ అవుతోంది. గత కొద్దిరోజుల నుంచి చుక్కలు చూపిస్తున్న బంగారం ధరలు శుక్రవరాం స్వల్పంగా తగ్గాయి. బంగారం కొనాలనుకునే పేద, మధ్య తరగతి వారికి ఊరటను మాత్రం ఇవ్వడం లేదు. శుక్రవారం బంగారం ధరల విషయానికి వస్తే.. పది గ్రాముల 24, 22,18 క్యారెట్ల బంగారంపై వరుసగా రూ.220, రూ. 200, రూ.170లు తగ్గింది. ప్రస్తుతం దేశీ మార్కెట్‌లలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,620 పలుకుతోంది. అలాగే పది గ్రాముల 22 క్యారెట్ల ధర రూ.1,31,650 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,07,720 వద్ద ట్రేడ్ అవుతోంది. గత రెండు రోజుల నుంచి వెండి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. నిన్న కిలో వెండి ధర రూ.3,10,000 వద్ద ట్రేడ్ అయింది. 100 గ్రాముల వెండి ధర రూ.31,000 దగ్గర ట్రేడ్ అయింది. నేడు కిలోపై రూ. 4000, 100 గ్రాములపై రూ.400 మేర తగ్గింది. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.3,06,000 వద్ద, 100 గ్రాముల వెండి ధర రూ.30,600 వద్ద ట్రేడ్ అయింది

# ముగిసిన సంక్రాంతి సెలవులు

**తిరుగు ప్రయాణాలకు సన్నాహాలు**

**ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనాల మళ్లింపు**

**నల్లగొండ, జనవరి 16 :** సంక్రాంతి సంబురాల ముగింపుతో పల్లెలకు వెళ్లిన వారు ఇళ్లకు చేరే సమయం ఆసన్నమైంది. శని, ఆదివారాల్లో నగరాలకు బయలుదేరనున్నారు. ఈ క్రమంలో రోడ్లు జామ్ కాకుండా, ట్రాఫిక్ చిక్కులు ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - విజయవాడ హైవేపై రద్దీని తగ్గించేందుకు నల్గొండ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.దారి మళ్లింపు వివరాలు ఇలావున్నామి. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను గుంటూరు, మిర్యాలగూడ, హాలియా, కొండమల్లేపల్లి, చింతపల్లి, మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలలను మాచర్ల,నాగార్జునసాగర్, పెద్దవూర,కొండపల్లేపల్లి, చింతపల్లి-మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లిస్తారు. నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను నల్లగొండ,మార్రిగూడ బై పాస్ -మునుగోడు , నారాయణపూర్- చౌటుప్పల్ (ఎన్.హెచ్ 65)మీదుగా హైదరాబాద్ తరలిస్తారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలను కోదాడ- హుజూర్‌నగర్- మిర్యాలగూడ- హాలియా-చింతపల్లి- మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లించారు. ఎన్. హెచ్ 65 విజయవాడ -హైదరాబాద్ రహదారి పై చిట్యాల,పెద్దకాపర్తిలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతున్నందున ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో చిట్యాల నుంచి భువనగిరి గుండా హైద్రాబాద్ మళ్లించడం జరుగుతుంది. ఈ మార్గాల ద్వారా వెళ్లడం వల్ల ప్రధాన రహదారి విజయవాడ, హైద్రాబాద్ పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ప్రయాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని పోలీసులు తెలిపారు.

# నోట్ల కట్టల కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

**దర్యాప్తు చట్టబద్దతపై సవాల్‌ను తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ, జనవరి 16 :** నోట్ల కట్టల కేసులో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తనను తొలగించాలని కోరుతూ వచ్చిన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఆమోదించడంతోపాటు తనపై దర్యాప్తు కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ ప్యానల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును జనవరి 8న రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం నేడు వెలువరించింది. గతేడాది జస్టిస్ యశ్వంత్ వర్మ దిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున నోట్లకట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది. అది ఇచ్చిన నివేదిక నేపథ్యంలో పదవి నుంచి వైదొలగాల్సిందిగా సుప్రీంకోర్టు సూచించింది. ఆయన దానికి అంగీకరించ కపోవడంతో పార్లమెంటులో అభిశంసనకు ప్రయత్నాలు జరిగాయి.

# అశ్వారావుపేటలో బీసీలకు అన్యాయం!

- అశ్వారావుపేట మున్సిపాలిటీలో జీవోకు విరుద్ధంగా వార్డు రిజర్వేషన్లు
- 22 వార్డుల్లో బీసీలకు రావాల్సిన 7కి బదులు కేవలం 4
- కాంగ్రెస్ హామీలు గాలిలో కలిశాయి

: ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్)



**అశ్వారావుపేట, జనవరి 16:** అశ్వారావుపేట మున్సిపాలిటీలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మున్నూరు అశ్వారావుపేట గీత కార్మిక సొసైటీ అధ్యక్షులు, గౌడ సంఘం కార్యదర్శి ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్) తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం బీసీలకు 31 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉండగా, అవి అశ్వారావుపేట మున్సిపాలిటీలో అమలు కావడం లేదని ఆరోపించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డులు ఉండగా, జీవో ప్రకారం బీసీలకు కనీసం 7 వార్డులు రావాల్సి ఉండగా కేవలం 4 మాత్రమే కేటాయించారని తెలిపారు. ఎస్టీలకు 6 శాతం ప్రకారం ఒక్క వార్డు రావాల్సి ఉండగా 3 వార్డులు, ఎస్సీలకు 12 శాతం ప్రకారం 3 వార్డులు రావాల్సి ఉండగా 4 వార్డులు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీని విస్మరించి, ప్రకటించిన 31 శాతం రిజర్వేషన్లను కూడా అశ్వారావుపేటలో అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. మండల, జిల్లా, రాష్ట్ర అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అశ్వారావుపేట మున్సిపాలిటీలో ప్రభుత్వ జీవో ప్రకారం రిజర్వేషన్లను సరిచేసి, బీసీలకు తగిన న్యాయం చేయాలని ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్) డిమాండ్ చేశారు.

# ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న బబ్బూరి శ్రీకాంత్ గౌడ్

**ఒగ్గు కళాకారులకు డోల్లు, తాళాలు అందజేసిన శ్రీకాంత్ గౌడ్**
**గతంలో గొల్ల, కురుమ సోదరులకు ఇచ్చిన హామీ**



**జనగామ, జనవరి 16 (జనంవార్త) :** పెద్దమదూర్ గ్రామ గొల్ల కురుమ సోదరులకు గతంలో తాను ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ మాట తప్పకుండా నిలబెట్టుకున్నారు. గతంలో గొల్ల,కురుమ సోదరులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ను కలిసి పలు సమస్యలను తెలియజేశారు. ప్రధానంగా తమ జానపద కళను కొనసాగించడానికి డోల్లు, తాళాలు లేవని,దీంతో జానపద కళను కొనసాగించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన శ్రీకాంత్ గౌడ్ తప్పకుండా జానపద కళను కాపాడుకోవడంలో భాగంగా గొల్ల కురుమలకుడోల్లు, తాళాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. తన హామీని నెరవేర్చడంలో భాగంగా శుక్రవారం గొల్ల కురుమ ఒగ్గు కళాకార సోదరులకు పిలిచి డోల్లు తాళాలు అందజేశారు. దీంతో గొల్ల కురుమ సోదరులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొల్ల కురుమ సోదరులు శ్రీకాంత్ గౌడ్ కు శాలువా కప్పి పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గొల్ల కురుమ సోదరులు మాట్లాడుతూ ఎంతో మంది రాజకీయ నాయకులు తాము ఎన్నికల్లో గెలవడం కోసం హామీలు ఇస్తూ ఎన్నికలు పూర్తికాగానే మరిచిపోవడం సర్వసాధారణం అయిపోయిందన్నారు. కానీ కొందరు రాజకీయ నాయకులు రాజకీయాలకు అతీతంగా తాము నిరుపేదలకు ఇచ్చిన హామీలను నిజాయితీగా నిలబెట్టుకుంటున్నారన్నారు. బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ గతంలో తమకు ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని గొల్ల కురుమ సోదరులకు, జానపద కళాకారులకు డోలు తాళాలు అందజేయడం అభినందనీయమన్నారు. గొల్ల కురుమ సోదరులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న శ్రీకాంత్ గౌడ్ కు గొల్ల కురుమ సోదరుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ తాను ఇచ్చిన ప్రతి హామీని ఖచ్చితంగా నెరవేరుస్తానని తెలిపారు. రాజకీయాలలో ఉన్నా లేకున్నా,ఎన్నికలలో గెలిచిన ఓడిన ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పానుగంటి గిరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండ రాములు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్,సీనియర్ నాయకులు కిషోర్,బోరేం నరేందర్,గోరుపెల్లి సంపత్,ఉపసర్పంచ్ సంపత్,వార్డు సభ్యులు వర్రె సోమయ్య, యాదయ్య,శేఖర్, వరలక్ష్మి,మల్లేష్, శ్రీశైలం, గొల్ల కురుమలు కర్రె ఉప్పలయ్య, మడిపల్లి మల్లేష్, శీలం బీరయ్య, కర్రె గట్టయ్య,వర్రె నరసింహ,కర్రె ఆనంద్, మోటికే సంపత్,మోటికే రాకేష్,జూంకల వినయ్, పార్టీ నాయకులు రేగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# తుమ్మల ఆశీస్సులు.. సంక్రాంతికి శుభారంభం

**మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల పుల్లారావు**



**అశ్వారావుపేట, జనవరి 16 :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావును, ఆయన తనయుడు తుమ్మల యుగంధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందుకోవడం జరిగిందని మాజీ డీసీసీబీ డైరెక్టర్, నారాయణపురం సహకార సంస్థ చైర్మన్, తుమ్మల వర్గం నేత నిర్మల పుల్లారావు తెలిపారు. అశ్వారావుపేట నియోజవర్గంలోని దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఉన్న తుమ్మల నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా నిర్మల పుల్లారావు మంత్రివర్యులకు సంక్రాంతి శుభా కాంక్షలు తెలియజేసి, వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, రాష్ట్ర అభివృద్ధి దిశగా, తెలంగాణ సమగ్ర పురోగతిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి అపూర్వమని ప్రశంసించారు. అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడ చూసినా తుమ్మల ముద్ర స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం శ్రమించే నాయకుడిగా తుమ్మల నాగేశ్వరరావు ప్రజల విశ్వాసాన్ని పొందారని అన్నారు. అలాంటి నాయకుడి ఆశీస్సులు అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని నిర్మల పుల్లారావు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పేరాయి గూడెం లీడర్ రాములు, పలువురు స్థానిక నాయకులు, పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# పల్లెల్లో నాటు సారా విజృంభణ.. ప్రాణాలు గాలిలో!

- గిరిజన గ్రామాల్లో గుత్తి కోయ గూడాలలో నాటు సారా ఏరులై పారుతోంది
- బైండ్ ఓవర్ కేసులు, మద్యం నియంత్రణలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఎక్సేంజ్ శాఖలో అధికారుల తక్షణ స్పందన లేక ఆందోళన పెరుగుతోంది





**అశ్వారావుపేట, జనవరి 16:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ముఖ్యం గా అశ్వారావుపేట మండలం గిరిజన పల్లెలలో నాటు సారా మద్యం విస్తీర్ణంగా విజృంభిస్తోంది. గుత్తి కోయ గూడాలు, పల్లె తండాలు నాటు సారా మద్యపు దుమారం కట్టలేక, ప్రజల ప్రాణాలు గాలి హారం కావచ్చునన్న భయాన్ని సృష్టిస్తున్నాయి. స్థానికులు చెబుతున్నారనగా, గతంలో ప్రభుత్వం కొన్ని "కఠిన చర్యలు" తీసుకున్నప్పటికీ, అవి కేవలం కంటి తుడుపు మాదిరిగానే మిగిలి, సమస్యను అదుపులోకి తెచ్చలేదని విమర్శిస్తున్నారు. బైండ్ ఓవర్ కేసులు ప్రజల దృష్టికి పెద్దగా రాలేదనే అంశం, స్థానిక రాజకీయ నేతల అండదండలతో మద్యం వ్యాపారంలో ఎక్కువగా సహకారం కలుగుతుందని స్థానికులు అంటున్నారు.మద్యం శాఖ కూడా అక్కడి పరిస్థితిపై పెద్ద ఎత్తున పట్టుబడటం లేదని, సిగ్గులేని నిర్లక్ష్యం వల్ల ప్రజల ఆందోళన రోజురోజుకూ పెరుగుతోంది. స్థానికులు తక్షణమే ఎక్సేంజ్ శాఖ అధికారులు గ్రామాలపై ఉక్కు పాదం మోపి, కఠిన చర్యలు చేపట్టి నాటు సారా వ్యాప్తిని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే మరిన్ని ప్రాణ నష్టాలు, అనారోగ్య సమస్యలు పల్లెలో విస్తరించే ప్రమాదం ఉన్నందున భయంతో ప్రజలు చర్చించుకుంటున్నారు. సంబంధిత ఎక్సేంజ్ శాఖను సంప్రదించినప్పటికీ అధికారులు అందుబాటులో లేక, ఇంకా అధికారిక ప్రకటన రాలేదని తెలుస్తోంది. స్థానికుల ఆవేదన ఈ సమస్యకు తక్షణ పరిష్కారం అవసరమని మినహాయించలేనంత తీవ్రమైంది.



# సంక్రాంతి సంబరాలతో కళకళలాడిన ఆలంఖాన్ గూడ

**చేవెళ్ల, జనవరి 16 :** శంకర్‌పల్లి మండలం ఆలంఖాన్ గూడ గ్రామంలో యువత ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. గ్రామ యువకులు ఐక్యతతో ముందుకు వచ్చి సంప్రదాయ పండుగకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. వేడుకల్లో భాగంగా రంగవల్లులు, భోగి మంటలు నిర్వహించారు. యువత పెద్దలను గౌరవిస్తూ, చిన్నారులను ఆనందపరిచేలా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు అందంగా ముగ్గులు వేసి పండుగ శోభను పెంచారు.గ్రామ పెద్దలు మాట్లాడుతూ యువత ఈ విధంగా సంప్రదాయాలను కాపాడుతూ పండుగలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామంలో సోదరభావం, ఐక్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యువతను ప్రోత్సహించారు.



# సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘన ముగింపు

**రంగారెడ్డి, జనవరి 16:**రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం చెక్కలోని గూడ గ్రామంలో నిర్వహించిన సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కార్యదర్శి, కేటీఆర్ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జి. విజయ్ కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.గత నాలుగు రోజులుగా ఉత్సాహంగా కొనసాగిన ఈ టోర్నమెంట్‌లో చెన్నై జట్టు విజేతగా నిలవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గెలుపు–ఓటములను సమానంగా స్వీకరించి, క్రీడలలో ముందుకు సాగాలని, అదే విధంగా చదువులో కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలని యువతకు సూచించారు. అధికారంలో ఉన్నా లేకపోయినా గ్రామాభివృద్ధి, క్రీడాకారుల ప్రోత్సాహానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని విజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టోర్నమెంట్ నిర్వాహకులు, జట్టు నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ట్రంప్ హెచ్చరికలు..

**800 మరణ శిక్షలు నిలిపేశారు : అమెరికా**

**యూఎస్ :** ఇరాన్‌లో పౌరుల ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. ఆందోళనకా రులను అణచివేసేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో 800 మందికి మరణ శిక్ష వేసేందుకు బుధవారం నిర్ణయం తీసుకున్నారని.. కానీ గురువారం ఆ నిర్ణయాన్ని విరమించుకున్నట్లు అమెరికా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. నిరసనకారులను అణచివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సైనిక చర్య చేపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో ఇరాన్ వెనక్కి తగ్గిందని ఆమె పేర్కొన్నారు. అక్కడి పరిస్థితులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిశితంగా పరిశీలిస్తు న్నారని.. భవిష్యత్తులో ఆయన ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చని తెలిపారు. ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటికే భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు సమాచారం.





# బాధితులకు అండగా ఎమ్మెల్యే జారె

- మృతుడి కుటుంబానికి భరోసా
- గాయపడినవారికి పరామర్శ
- అనారోగ్య బాధితుల వద్దకు వెళ్లి ధైర్యం

**దమ్మపేట, జనవరి 16 :** దమ్మపేట మండలం బాలరాజుగూడెం పంచాయతీ దిబ్బగూడెం గ్రామానికి చెందిన పొట్టా శ్రీను అనారోగ్యంతో మృతి చెందగా, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వారి నివాసానికి వెళ్లి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే జగ్గారం పంచాయతీ గురువాయిగూడెం గ్రామానికి చెందిన వాడే జంపన్న ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. అవసరమైన వైద్య చికిత్సకు ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని తెలిపారు. చెన్నువారిగూడెం గ్రామానికి చెందిన కారం నాగరాజు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా అండగా నిలుస్తుందని, ఉచిత వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులాల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం



**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 16:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్ అడ్మిషన్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం ఐడీఓసీ క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలు తమ పిల్లలను ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలని కోరారు. జిల్లాలో కొత్తగూడెం బాలికలు, బాలురు, బూర్గంపాడు బాలికలు, భద్రాచలం బాలురు, అశ్వారావుపేట బాలికలు, ఇల్లందు బాలికల గురుకులాల్లో అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మైనార్టీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గురుకులాల ఉచిత, నాణ్యమైన విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కే. సంజీవరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ఎల్సీ ఎం.జే. అరుణ కుమారి, విజిలెన్స్ అధికారులు కే. సీతారాములు, ఎం.ఏ. రవూఫ్, మైనార్టీ గురుకులాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు. అడ్మిషన్లపై అవగాహన కోసం సీతారాములు రూపొందించిన ఆడియో, వీడియో పాటలను జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో ప్రారంభించారు.

# ఎమ్మెల్యే వద్ద సంక్రాంతి శుభాకాంక్షలు

- జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు
- గండుగులపల్లిలోని స్వగృహంలో కనుమ శుభాకాంక్షలు.



**అశ్వారావుపేట, జనవరి 16:** నియోజకవర్గ అంశాలపై చర్చ అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు అందజేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, తుమ్మల వర్గం వీర విధేయుడు చందు వేణుగోపాల్ తెలిపారు. శనివారం అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే స్వగ్రామ స్వగృహంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పలు నియోజకవర్గానికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చందు వేణుగోపాల్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించే నాయకుడిగా ఎమ్మెల్యే ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.



# గ్రోక్‌లో అశ్లీల చిత్రాలు..

## మస్క్ కంపెనీపై దావా

**యూఎస్ :** సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో కృత్రిమ మేధ ఆధారిత 'గ్రోక్' చాట్‌బాట్ అసభ్య చిత్రాలను రూపొందిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా అమెరికా రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ కూడా.. గ్రోక్‌లో తన అసభ్య చిత్రాలను కొందరు యూజర్లు సృష్టించినట్లు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎక్స్‌ఏఐపై న్యాయస్థానంలో దావా వేశారు. తన బిడ్డకు ఎలాన్ మస్క్ తండ్రి అని గతంలో ఆష్లీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎక్స్‌ఏఐలోని గ్రోక్.. అసభ్య చిత్రాలను సృష్టిస్తోందని ఆష్లీ ఆరోపించారు. తన అనుమతి లేకుండా ఇప్పటికే డజన్లకొద్దీ అసభ్య, అభ్యంతరకర చిత్రాలను సృష్టించిందన్నారు. ఇటీవల ఓ చిత్రాన్ని ఆ సంస్థ దృష్టికి తీసుకెళ్లానని.. ఆ తర్వాత కూడా అనేక ఇమేజ్‌లు దర్శనమిస్తున్నాయన్నారు. దీంతో న్యూయార్క్ న్యాయస్థానంలో దావా వేసిన ఆమె.. సంస్థపై చర్యలు తీసుకోవడంతో పాటు పరిహారాన్ని డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే, దీనిపై ఎక్స్ ఏఐ నుంచి ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై ఆష్లీ క్లెయిర్ గతంలో సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తమ ఇద్దరికి పుట్టిన చిన్నారికి తండ్రిగా తన పేరును బయటపెట్టొద్దని మస్క్ తనను కోరినట్లు ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని దాచిపెట్టేందుకు 15 మిలియన్ డాలర్లను మస్క్ ఆఫర్ చేశారని చెప్పారు. మరోవైపు మహిళలు, చిన్నారుల అసభ్య చిత్రాలను గ్రోక్ సృష్టిస్తుందని భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆరోపిస్తున్నాయి. ఇండోనేసియా, మలేసియా దేశాలు ఇప్పటికే గ్రోక్ వినియోగంపై ఆంక్షలు విధించగా.. బ్రిటన్ సహా పలు యూరప్ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో దిద్దుబాటు చర్యలు చేపట్టిన ఎక్స్.. గ్రోక్ణ సాయంతో వ్యక్తుల ఫొటోలను ఇబ్బందికరంగా మార్చే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇటీవలే వెల్లడించింది.



# ఇరాన్ చెరలో భారత నావికులు

## కుటుంబీకుల ఆందోళన

**ఇరాన్ :** భారత్‌కు చెందిన 16 మంది నావికులు గతనెల ఇరాన్‌లో చిక్కుకున్న విషయం తెలిసిందే. వీరిని అక్కడి భద్రతా సిబ్బంది అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో బాధిత కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నావికులను సురక్షితంగా వెనక్కి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఈ అంశానికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. యూఏఈలోని దిబ్బా పోర్టు సమీపంలో అంతర్జాతీయ జలాల్లో వెళ్తున్న వాలియంట్ రోర్ అనే నౌకను ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ గతేడాది డిసెంబర్ 8న వెంబడించారు. ఆ నౌకలో 6వేల మెట్రిక్ టన్నుల ఇంధనం స్మగ్లింగ్ చేస్తోందని ఆరోపిస్తూ.. అందులో ఉన్న సిబ్బందిని నిర్బంధించారు. ఆ సమయంలో నౌకలో 18 మంది నావికులు ఉండగా వారిలో 16 మంది భారతీయులున్నట్లు సమాచారం. వీరిలో పది మందిని జైలుకు తీసుకెళ్లగా మిగతా వారు ఇరాన్ గార్డుల నిఘాలో నౌకలోనే ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా ఆర్‌పీఎస్‌ఎల్-లైసెన్స్ (భారత్‌తో పాటు విదేశీ నౌకల్లో పని చేసేందుకు ఈ సంస్థలు నియామకాలు చేపట్టే సంస్థలు) ఉన్న నావికులేనని సమాచారం. ఈ ఘటనకు సంబంధించి నౌక కెప్టెన్ నుంచి కుటుంబీకులకు అత్యవసర సందేశం అందింది. ఇందులో ఖేతన్ మెహతా అనే ఇంజినీర్ తల్లిదండ్రులు భారత్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్ ప్రభుత్వంతో చర్చించి తమ వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అంతలోపు వారికి వైద్య, న్యాయ, ఆర్థికసాయం అందించేలా ఇరాన్‌లోని భారత కాన్సులేట్‌ను ఆదేశించాలని కోరుతూ బాధిత కుటుంబీకులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. ఈ అంశానికి సంబంధించి స్టేటస్ రిపోర్టును అందజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.



# ట్రంప్ హెచ్చరికలు..

## 800 మరణ శిక్షలు నిలిపేశారు : అమెరికా

**యూఎస్ :** ఇరాన్‌లో పౌరుల ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. ఆందోళనకారులను అణచివేసేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో 800 మందికి మరణ శిక్ష వేసేందుకు బుధవారం నిర్ణయం తీసుకున్నారని.. కానీ గురువారం ఆ నిర్ణయాన్ని విరమించుకున్నట్లు అమెరికా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. నిరసనకారులను అణచివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సైనిక చర్య చేపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో ఇరాన్ వెనక్కి తగ్గిందని ఆమె పేర్కొన్నారు. అక్కడి పరిస్థితులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిశితంగా పరిశీలిస్తున్నారని.. భవిష్యత్తులో ఆయన ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చని తెలిపారు. ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటికే భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

## ట్రంప్‌నకు నోబెల్ అందజేసిన

# వెనెజువెలా విపక్ష నేత మచాడో

**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తన నోబెల్ పురస్కారాన్ని ట్రంప్‌నకు అందజేశారు. తమ దేశ సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి గుర్తుగా దీనిని ఇచ్చినట్లు చెప్పారు. వెనెజువెలా భవిష్యత్తు గురించి ఆయనతో చర్చించానని, తమ దేశ ప్రజలు స్వేచ్ఛ కోసం అమెరికా అధ్యక్షుడిపై ఆధారపడొచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరేబియన్‌లో చమురు ట్యాంకర్‌లను అమెరికా దళాలు స్వాధీనం చేసుకుంటున్న విషయాన్ని ట్రంప్‌తో చర్చించినట్లు సమాచారం.

### మచాడో అద్భుత మహిళ : ట్రంప్

మచాడోతో భేటీ కావడంపై అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఆమె ఇచ్చిన నోబెల్ పురస్కారాన్ని అంగీకరిస్తున్నట్లు తెలిపారు. "మచాడోతో సమావేశం కావడం గొప్ప విషయం. ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న అద్భుత మహిళ ఆమె. నేను చేస్తున్న కృషికి గుర్తింపుగా తన నోబెల్ బహుమతిని నాకు అందజేశారు. పరస్పర గౌరవానికి ఇది మంచి సంకేతం. థాంక్యూ మరియా" అని సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టు చేశారు.

### నోబెల్‌ను అలా ఇవ్వొచ్చా..?

తనకు లభించిన శాంతి బహుమతిని అధ్యక్షుడు ట్రంప్‌నకు



ఇస్తానని మచాడో చెప్పడంపై నోబెల్ ఇన్‌స్టిట్యూట్ ఇటీవల స్పందించింది. ఒకసారి నోబెల్ ప్రకటించిన తర్వాత.. దానిని రద్దు, బదిలీ చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం కుదరదని స్పష్టం చేసింది. కమిటీ నిర్ణయమే అంతిమమని, దీనిలో ఎటువంటి మార్పు ఉండబోదని, ఎప్పటికీ ఇదే వర్తిస్తుందని పేర్కొంది. అయినప్పటికీ మచాడో తన నోబెల్ బహుమతిని ట్రంప్‌నకు ఇవ్వడం గమనార్హం. మరోవైపు ఆ మెడల్‌ను ట్రంప్ తన వద్దే ఉంచుకోవాలని భావిస్తున్నట్లు వైట్‌హౌస్ అధికారి వెల్లడించినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి.



# నోట్ల కట్టల కేసు..

## జస్టిస్ యశ్వంత్ వర్మకు చుక్కెదురు

**న్యూఢిల్లీ :** నోట్ల కట్టల కేసులో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తనను తొలగించాలని కోరుతూ వచ్చిన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఆమోదించడంతోపాటు తనపై దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును జనవరి 8న రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం నేడు వెలువరించింది. గతేడాది జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది. అది ఇచ్చిన నివేదిక నేపథ్యంలో పదవి నుంచి వైదొలగాల్సిందిగా సుప్రీంకోర్టు సూచించింది. ఆయన దానికి అంగీకరించకపోవడంతో పార్లమెంటులో అభిశంసనకు ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన జస్టిస్ వర్మకు అక్కడ మళ్లీ చుక్కెదురైంది.

## భార్య కాలిపోతున్నా

# వీడియో తీస్తూ..

## నిందితుడి అరెస్టు



**సూరత్ :** కళ్లముందే భార్య నిప్పంటించుకుని కాలిపోతున్నా.. కాపాడకుండా వీడియో తీశాడో భర్త. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ దిగ్భ్రాంతికర ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన రంజిత్ సాహ్, ప్రతిమా దేవీ (31) 2013లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ముగ్గురు పిల్లలతో మూడేళ్ల క్రితం సూరత్‌కు వచ్చి స్థిరపడ్డారు. ఇటీవల భర్తతో గొడవపడిన ఆమె ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్తపై అనుమానంతో ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా.. ఆమె నిప్పంటించుకున్న సమయంలో రంజిత్ తన ఫోన్‌లో రికార్డు చేసిన వీడియోను పోలీసులు గుర్తించారు. గొడవ జరుగుతున్నప్పుడు భార్యను అతడు ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు పోలీసులు చెప్పారు. ఈ క్రమంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనలో తన ప్రమేయం ఏమీ లేదని చెప్పేందుకే ఈ వీడియో తీశానని అతడు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

## జనవరి 20న భాజపా

# నూతన అధ్యక్షుడి ప్రకటన

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీకి మరికొన్ని రోజుల్లో కొత్త సారథి రానున్నారు. పార్టీ నూతన అధ్యక్షుడి కోసం ఎన్నిక తేదీని భాజపా శుక్రవారం ప్రకటించింది. ఈ పదవికి జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు భాజపా రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19వ తేదీ మధ్యాహ్నం 2-4 గంటల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5-6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నిక అవసరమైతే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ ప్రక్రియంతా భాజపా ప్రధాన కార్యాలయంలో జరగనుంది. కాగా.. ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్‌నే పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువనాయకత్వాన్ని తయారు చేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్




కు చెందిన నితిన్ నబీన్ సిన్హాను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు.

# కదిలే కారులోకి దూకిన అడవి జంతువు

## తల్లి ఒడిలోని చిన్నారి మృతి

**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబం కారులో వెళ్తుండగా.. అడవి జంతువు ఉన్నట్టుండి కారులోకి దూసుకురావడంతో ముందు సీట్లో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుణ ప్రాంతానికి చెందిన సోను జాట్ అనే వ్యక్తి సంక్రాంతి పండగను జరుపుకోవడానికి తన భార్య, నాలుగేళ్ల కుమార్తె తాన్యతో కలిసి బుధవారం వారి స్వగ్రామానికి బయల్దేరాడు. బైపాస్‌లోని దోఖంభా ప్రాంతంలో వారు కారులో వెళ్తుండగా.. రెండు నీల్‌గాయ్ జంతువులు అకస్మాత్తుగా రోడ్డు పైకి వచ్చాయి. సోను అప్రమత్తమయ్యేలోపు ఆ జంతువుల్లో ఒకటి కారు అద్దం పగలగొట్టుకుని లోపలికి దూసుకువచ్చింది. దీంతో ముందు సీటులో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల తాన్య తలకు జం



తువు కాళ్లు బలంగా తాకడంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కారులో చిక్కుకున్న నీల్‌గాయ్‌ను బయటకు తీసి, చికిత్స అందిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.



# భారతదేశం (సెక్యూలర్) లౌకికరాజ్యం

## మత స్వేచ్ఛను గౌరవిస్తూ తటస్థంగా ఉండటమే లౌకిక వాదం

## తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్

**సూర్యాపేట :** సూర్యాపేట రూరల్ మండల కేంద్రం యల్కారం గ్రామం నందు ఆర్.సి.యం.చర్చి లో స్థానిక సంఘ కాపరి పాస్టర్ మిద్దె హెబ్రోన్ రాజు ఆధ్వర్యంలో జరిగిన పాస్టర్స్ సమావేశంలో ముఖ్య అతిధులుగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్, సువార్త చర్చ్ ఆంధ్ర తెలంగాణ రాష్ట్రల కో ఆర్డినేటర్ పాస్టర్ సి. హెచ్. శ్యామ్ ప్రసాద్, పాస్టర్ అబ్రాహాము జార్జ్, బిషప్ ముల్లంగి జాకబ్ రాజు, పాల్గొన్నారు,ఈ సందర్బంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ భారత దేశంలో ప్రస్తుత పరిస్థితులను బట్టి చుస్తే ముఖ్యంగా ప్రజలకు రాజ్యాంగం పట్ల అవగాహనా లేక దేశ అభివృద్ధి కుట్టు పట్టిందని, మనదేశ రాజ్యాంగం రాజకీయ పదజాలంలో, లౌకిక వాదం (సెక్యులరిజం) అనునది, ప్రభుత్వాన్ని, మతాన్ని వేరుగా వుంచడం అనీ, అటువంటి ప్రభుత్వాన్ని "మతప్రసక్తి లేని లౌకిక రాజ్యం"గా వ్యవహరిస్తారనీ అన్నీ మతాలను గౌరవించడమే రాజ్యాంగం ముఖ్య ఉద్దేశం అనీ,ఈ విధానంలో రాజ్యము తన దేశప్రజలలో అనేక మతాలు కలిగివున్ననూ, ప్రభుత్వంలో ఏమతమూ కలిగి వుండక పోవడం.పౌరచట్టాలతో మత సంప్రదాయాలకు తావు లేకపోవడం, చర్చ్ లలో, మషీద్ లో, దేవాలయలలో మత గ్రంధాలతో పాటు రాజ్యాంగంను, బోదించాలని ఆలాగే అందరికి అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ సలహాదారులు బొక్క ఏలీయా రాజు,ఉమ్మడి జిల్లా క్రైస్తవ నాయకులు చింత మనిషి,జిల్లా క్రైస్తవ నాయకులు రాజు ఉటుకూరి, పెన్ పహాడ్ మండలం అధ్యక్షులు రెవ. డి. జాన్ ప్రకాష్, పి. వి. బోయాజ్,యం. రూబెన్, పి.మార్క్,భాస్కర్ కె. హెూసన్నా,పి. సామెల్, డికెన్ ఫాదర్ శ్యాగ యాకోబు, బి. సైమన్, ఆర్. ప్రేమ్ సాగర్, డి. రాజు తదితరులు పాల్గొన్నారు



# ఈసారి బుల్లెట్ మిస్ కాదు

## ఇరాన్ టీవీలో ట్రంప్‌పై బెదిరింపులు


**ఇరాన్ :** నిరసనకారులపై అణచివేతకు పాల్పడుతున్న ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు దిగడం తప్పేలా కన్పించట్లేదు. ఆందోళనకారులకు ముందు నుంచీ మద్దతు పలుకుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు టెహ్రాన్‌పై దాడులకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్‌పై ఇరాన్ ప్రత్యక్ష బెదిరింపులకు పాల్పడింది. ఈసారి బుల్లెట్ మిస్ కాదని హెచ్చరించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. నాటి ఘటనకు సంబంధించిన ఫొటోను ప్రసారం చేసిన ఇరాన్ టీవీ.. 'ఈసారి అది (బుల్లెట్) గురి తప్పదు' అని బెదిరింపుల సందేశాన్ని టెలికాస్ట్ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అమెరికా ఏ క్షణమైనా ఇరాన్‌పై దాడికి పాల్పడవచ్చనే ఊహాగానాల వేళ ఈ బెదిరింపులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 2024 జులైలో పెన్సిల్వేనియాలో ట్రంప్ ఎన్నికల ప్రచారంలో ఉండగా.. ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో అమెరికా అధ్యక్షుడి చెవికి గాయమైంది. ఈ హత్యాయత్నం వెనక ఇరాన్ ఉన్నట్లు అప్పట్లో అమెరికా ప్రభుత్వం ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా ఇరాన్‌పై 24 గంటల్లో సైనిక చర్యకు ఉపక్రమించాలని ట్రంప్ నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే ఖతార్‌లో ఉన్న తమ కీలక అల్-ఉదెయిద్ వైమానిక స్థావరంతో పాటు పశ్చిమాసియా వ్యాప్తంగా పలు సైనిక స్థావరాల నుంచి కొంతమంది సిబ్బందిని అమెరికా ఖాళీ చేయించింది.

### మా బెదిరింపులతో ఇరాన్ ఆగింది : ట్రంప్

మరోవైపు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టిన వారిపై ఉక్కుపాదం మోపుతున్న ఇరాన్.. ఓ నిరసనకారుడిని ఉరితీసేందుకు సిద్ధమైనట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, దాన్ని టెహ్రాన్ నిలిపివేసినట్లు ట్రంప్ తెలిపారు. తన బెదిరింపుల వల్లే హత్యలు, ఉరిశిక్షలను ఇరాన్ నిలిపివేసిందని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందన్నారు. ఈ నిరసనల్లో ఇప్పటివరకు మరణాల సంఖ్య 3 వేలు దాటినట్లు అంచనాలు వెలువడుతున్నాయి.

# గూఢచర్య ఆరోపణలు..

## బ్రిటన్ దౌత్యవేత్తను బహిష్కరించిన రష్యా



**మాస్కో:** గూఢచర్యం ఆరోపణలతో మాస్కోలోని బ్రిటన్ దౌత్యవేత్తను దేశం నుంచి బహిష్కరించినట్లు రష్యా భద్రతాధికారులు వెల్లడించారు. మాస్కోలోని బ్రిటిష్ రాయబార కార్యాలయంలో కార్యదర్శిగా ఉన్న గారెత్ శామ్యూల్ డేవిస్ యూకేలోని రహస్య నిఘా సంస్థల కోసం పనిచేస్తున్నట్లు గుర్తించామని ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ పేర్కొంది. దీంతో రెండు వారాల్లోగా రష్యాను వీడి వెళ్లిపోవాలని ఆయనకు సమన్లు జారీ చేసింది. రష్యా భూభాగంలో ఉంటూ.. జాతీయ భద్రతా విషయాల ను విదేశాల నిఘా సంస్థలకు చేరవేయడాన్ని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని రష్యన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ చర్యలకు ప్రతిగా పరిస్థితులను తీవ్రతరం చేయడానికి యూకే ప్రభుత్వం ప్రయత్నిస్తే.. ప్రతీకార చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. ఇప్పటివరకూ లండన్, రష్యా మధ్య ఉన్న స్నేహపూర్వక చర్యల కారణంగా సదరు దౌత్యవేత్తపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం బహిష్కరిస్తున్నట్లు తెలిపింది. కాగా 2025లోనూ ఇదే విధంగా గూఢచర్యం ఆరోపణలతో మాస్కో ఇద్దరు బ్రిటన్ దౌత్యవేత్తలను దేశం నుంచి సాగనంపింది.

## శివాజీ వ్యాఖ్యలు తప్పే

### నటుడు హర్షవర్ధన్ కామెంట్స్



స్వేచ్ఛలో దుస్తులు భాగం.. కానీ, దుస్తులు మాత్రమే స్వేచ్ఛ కాదన్నారు నటుడు హర్షవర్ధన్. కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన శివాజీ కామెంట్స్‌పై ఆయన ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రస్తుతం హర్ష కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సున్నితమైన విషయాన్ని బాగా వివరించారంటూ ఆయన్ను నెటిజన్లు సపోర్ట్ చేస్తున్నారు.'దొంగల మనసు మార్చే కన్నా.. ఇంటికి తాళం వేసుకోవడం ఉత్తమం. అది నా చేతిలో ఉన్న పని. నా ఇంట్లో వాళ్లకు జాగ్రత్తగా ఉండండి అని చెప్పడం నాకు సులభం. అంతేకానీ, దొంగల్లారా ఆలోచించండి.. నేను లేని సమయంలో ఒంటరిగా ఉన్న నా వాళ్లపై దాడి చేయకండి అని దొంగలకు చెప్పడం కష్టం. గత కొన్ని రోజులుగా సాగుతోన్న అంశంపై ఆలోచిస్తే ఒక విషయం అర్థమవుతుంది. రెండు టాపిక్‌లను ఎప్పుడూ కలపకూడదు. స్వేచ్ఛ గురించి మాట్లాడితే దానిమీదే ఫోకస్ చేయాలి.. దుస్తుల గురించి అయితే వాటి గురించే మాట్లాడాలి. మంచి ఉద్దేశంతో ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు మాట్లాడేతీరు సరిగ్గా లేకపోతే వాళ్లు శివాజీ, అనసూయలు అవుతారు. శివాజీ మాట్లాడిన తీరు మాత్రమే తప్పు.. స్వేచ్ఛ అనే దానిలో చాలా రకాలు ఉంటాయి. కేవలం మోడ్రన్ దుస్తులు ధరించడం మాత్రమే స్వేచ్ఛ కాదు. వాటి గురించి మాట్లాడే సమయంలో స్వేచ్ఛ అనే పదాన్ని వాడకూడదు. మనం ఉంటున్న ప్రదేశాన్ని బట్టి కూడా మన డ్రెస్సింగ్ ఆధారపడి ఉంటుంది అని హర్షవర్ధన్ చెప్పారు.

## పూరి-సేతుపతి మూవీ టైటిల్ స్లమ్ డాగ్

విజయ్ సేతుపతి -పూరి జగన్నాథ్ కాంబోలో రానున్న సినిమా టైటిల్ ఖరారయ్యింది. ఇప్పటివరకూ 'పూరి సేతుపతి'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే పేరు ఖరారు చేశారు. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి ఆసక్తికర లుక్‌లో కనిపించారు. చేతిలో కత్తి పట్టుకొని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా ఉన్నారు. ఈ పోస్టర్‌ను పంచుకున్న టీమ్ ఆసక్తికర క్యాప్షన్‌ను షేర్ చేసింది. 'మురికివాడల నుంచి ఎవరూ తట్టుకోలేని తుపాను వస్తుంది.. అది చాలా భయంకరంగా ఉంటుంది' అనే క్యాప్షన్ ఇందులో విజయ్ పాత్ర తీరును తెలిపేలా ఉంది. ఎన్నో రోజులుగా ఈ సినిమాకు రకరకాల టైటిల్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ 'స్లమ్ డాగ్'ను అధికారికంగా ప్రకటించారు. గతేడాది జులై మొదటివారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదు నెలల్లోనే కంప్లీట్ చేసేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. సంయుక్త కథానాయికగా నటించారు. టబు (ఁజీశిబీ), విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం ముస్తాబైంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.




## 'మన శంకర వరప్రసాద్ గారు..'

# ₹200 కోట్లు

## రికార్డు వసూళ్లు

చిరంజీవి అభిమానులు మర్చిపోలేని సంక్రాంతి ఇది. పండగ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మన శంకరవరప్రసాద్‌గారు' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు, యూఎస్‌లో అదరగొడుతోంది. ఇప్పటివరకూ ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. అతి తక్కువ సమయంలో రూ.200 కోట్లు రాబట్టిన చిరంజీవి చిత్రంగా రికార్డు సృష్టించింది. అంతేకాదు, బుక్‌మై షోలోనూ ఈ మూవీ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. ఇప్పటివరకూ 20 మిలియన్ టికెట్లు విక్రయమయ్యాయి. మల్టీప్లెక్స్‌ల్లో కూల్‌గా నవ్వులు పంచుతున్న ఈ మూవీ.. బీ, సీ సెంటర్లలో జాతరకు ఏమాత్రం తీసిపోవడం లేదు. వయసుతో సంబంధం లేకుండా ఈ మూవీని ఆస్వాదిస్తున్నారు. మరోవైపు రికార్డు వసూళ్లపై దర్శకుడు అనిల్ రావిపూడి సంతోషం వ్యక్తం చేశారు. "ఇది కేవలం ఫస్ట్ పవర్‌ప్లే.. బాస్ బ్యాటింగ్‌తో 'INFRONT COLLECTION' ఫెస్టివల్. ప్రేక్షక దేవుళ్లకి ధన్యవాదాలు" అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఇక ఇప్పటివరకూ చిరు కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'సైరా నరసింహారెడ్డి' నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా రూ.244 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఆ తర్వాత 'వాల్తేరు వీరయ్య' రూ.232 కోట్లు (గ్రాస్) రాబట్టింది. ఈ వసూళ్లన్నీ ఫుల్ థియేట్రికల్ రన్‌లో వచ్చినవే. కానీ, ఇప్పుడు 'మన శంకరవరప్రసాద్‌గారు' కేవలం నాలుగున్నర రోజుల్లోనే రూ.200 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే, 'మన శంకరవరప్రసాద్‌గారు'.. ఫ్లాష్‌మ్యాన్ వేగాన్ని మించి రూ.300 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం.







## హారర్ కథలంటే భయం

'ది రాజాసాబ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ప్రశంసలు తనకెంతో ఆనందాన్నిస్తోంది అంది నటి నిధి అగర్వాల్. "దర్శకుడు మారుతి నాకీ కథ వినిపించినప్పుడే ఇది కచ్చితంగా ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటుందని అర్థమైంది. అన్ని తాంత్రిక విద్యలు తెలిసి.. సైకలాజికల్‌గా మైండ్ గేమ్స్ ఆడే ఓ దుష్టశక్తిని హీరో దైవికంగా ఎలా ఎదుర్కొన్నాడన్నది మారుతి కొత్తగా చూపించారు. స్క్రిప్ట్ విన్నప్పుడు నాకదే వినూత్నంగా అనిపించింది. దీనికి ముందు నేను చేసిన 'హరి హర వీరమల్లు'లో రాకుమారిగా నటించా. ఈ సినిమాలో బెస్సీ అనే నన్ పాత్ర పోషించా. ఈ పాత్రని నేను చాలా ఎంజాయ్ చేస్తూ చేశా. అయితే ఒకే సమయంలో అటు పవన్ కల్యాణ్ చిత్రానికి.. ఇటు ప్రభాస్ సినిమాకి పని చేయాల్సి రావడం వల్ల నాకు సరైన నిద్ర కూడా ఉండేది కాదు. ఆ టైమ్‌లో 'రాజాసాబ్' బృందం నాకెంతో సహకరించింది. సెట్‌లో నన్ను బాగా చూసుకునేవాళ్లు. అందుకే ప్రభాస్ కూడా ప్రీరిలీజ్ వేడుకలో 'నిధి అగర్వాల్ అంటే సెట్‌లో అందరికీ ఇష్టమ'ని చెప్పారు". "నాకు దెయ్యాలు, హారర్ కథలంటే భయం. అందుకే రాత్రి నిద్రపోయేటప్పుడు లైట్స్ వేసుకుని, హనుమాన్ చాలీసా లూప్‌లో వింటూ నిద్రపోతా. ప్రస్తుతం నేను తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. హిందీలో రెండు చిత్రాల్లో నటిస్తున్నా. తెలుగులో బిజీగా ఉండటం వల్ల హైదరాబాద్‌లోనే ఇల్లు తీసుకున్నా. నేనెక్కడికి వెళ్లినా నాది తెలుగు సినిమా అనే చెప్పుకుంటాను".

## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీలో అనిల్ కపూర్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, పాన్ ఇండియా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'డ్రాగన్' ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు పెంచుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ భాగమవుతున్నారనే వార్తలు మరింత హీట్ పెంచుతున్నాయి. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణబీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ చేసిన పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. వయసు పెరిగిన తర్వాత కూడా పవర్‌ఫుల్ క్యారెక్టర్లతో తన మార్క్ చూపిస్తున్న అనిల్, ఇప్పుడు 'డ్రాగన్'లో కూడా అంతే బలమైన పాత్రలో కనిపించబోతున్నారనే చర్చ నడు స్తోంది. ఐఎండీబీ మోస్ట్ యాంటిసిపేటెడ్ ఇండియన్ మూవీస్ జాబితాలో 'డ్రాగన్' చోటు దక్కిన విషయాన్ని పరోక్షంగా హైలైట్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌పై తన ఆసక్తిని అనిల్ కపూర్ వ్యక్తం చేశారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో సీనియర్ నటుల పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో సంజయ్ దత్‌ను భీకరమైన విలన్‌గా చూపించి కొత్త కోణంలో ఆవిష్కరించారు. అలాగే 'సలార్'లో జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రలు కథకు బలమైన స్థంభాలుగా నిలిచాయి. అదే తరహాలో 'డ్రాగన్'లో అనిల్ కపూర్ పాత్ర కూడా కథను మలుపు తిప్పే స్థాయిలో ఉంటుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది.

## ఆగని దురంధరన్ దూకుడు

### 15న ఒక్కరోజే మూడుకోట్ల వసూళ్లు

రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ బాక్సాఫీస్ వద్ద తన జోరు ఇంకా తగ్గించలేదు. విడుదలై ఆరు వారాలు పూర్తయినా, ఈ సినిమా కలెక్షన్ల పరంగా రోజుకో కొత్త రికార్డును నమోదు చేస్తూ ఇండియన్ సినీ పరిశ్రమలో అరుదైన ఘనతలు సాధిస్తోంది. ముఖ్యంగా విడుదలైన 42వ రోజున కూడా భారీ వసూళ్లు రాబట్టి సినీ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇండియన్ సినిమాల చరిత్రలో 42వ రోజున అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ధురంధర్ నిలవడం విశేషం. జనవరి 15న మాత్రమే ఈ చిత్రం సుమారు రూ.3 కోట్ల నికర వసూళ్లు సాధించింది. ఇంతకు ముందు ఈ రికార్డు ఛావా (రూ.1.35 కోట్లు) పేరిట ఉండగా, దాన్ని భారీ తేడాతో ధురంధర్ బ్రేక్ చేసింది. ఈ సినిమా థియేటర్లలోకి వచ్చిన మొదటి రోజు నుంచే బలమైన పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. రూ.28 కోట్ల ఓపెనింగ్‌తో మొదలైన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే వంద కోట్ల మార్క్‌ను దాటేసింది. మొదటి వారాంతం ముగిసే సరికి దాదాపు రూ.103 కోట్ల వసూళ్లు నమోదు చేసి ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తొలి వారం మొత్తం కలెక్షన్లు రూ.207 కోట్లకు పైగా ఉండటం ఈ సినిమాకు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపించింది. రెండో వారం వచ్చాక కూడా గ్రాఫ్ పడిపోకుండా మరింత బలంగా నిలిచింది. ముఖ్యంగా వీకెండ్లలో ప్రేక్షకుల తాకిడి పెరగడంతో 9వ, 10వ రోజుల్లో రికార్డు స్థాయి వసూళ్లు నమోదయ్యాయి. రెండో వారం ముగిసే సరికి మరో రూ.250 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయి. ఆ తర్వాత మూడో, నాలుగో వారాల్లోనూ సినిమా స్థిరమైన రన్ కొనసాగిస్తూ వరుసగా రూ.172 కోట్లు, రూ.106 కోట్లకు పైగా వసూలు చేసింది. ఐదో వారం, ఆరవ వారాల్లో కొత్త సినిమాల పోటీ ఉన్నప్పటికీ ధురంధర్ తన స్క్రీన్లను నిలబెట్టుకుని మంచి వసూళ్లు రాబట్టింది. 39వ రోజు నుంచి 42వ రోజు వరకూ రోజుకు రూ.2 నుంచి 3 కోట్ల మధ్య కలెక్షన్లు రావడం ఈ సినిమాకు లభించిన అరుదైన ఘనతగా చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకు దేశీయంగా ఈ చిత్రం దాదాపు రూ.817 కోట్ల నికర వసూళ్లు నమోదు చేయగా, భారతదేశ గ్రాస్ కలెక్షన్లు రూ.976 కోట్లకు చేరుకున్నాయి. అదే సమయంలో ఓవర్సీస్ మార్కెట్లలో కూడా రూ.293 కోట్ల వరకు వసూలు చేసి, మొ-ుత్తం ప్రపంచవ్యాప్తంగా రూ.1,270 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించింది. మొత్తంగా చూస్తే, ధురంధర్ కేవలం ఒక హిట్‌గా మాత్రమే కాకుండా, దీర్ఘకాలం బాక్సాఫీస్‌పై ఆధిపత్యం చూపిన అరుదైన ఇండియన్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇంకా థియేటర్లలో కొనసాగుతున్న ఈ సినిమా రన్ చివరికి ఎక్కడ ఆగుతుందో చూడాల్సిందే.



జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# ప్రపంచ వృద్ధికి భారత్ కీలక చోదక శక్తి : ఐఎంఎఫ్

ప్రపంచ వృద్ధికి భారత్ కీలకమైన చోదక శక్తి అని అంతర్జాతీయ ద్రవ్యనిధి పేర్కొంది. దేశ మూడో త్రైమాసిక వృద్ధి.. అంచనాల కన్నా బలంగా ఉందని తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అనిశ్చితులు నెలకొన్న వేళ ప్రపంచ ఆర్థిక విస్తరణకు భారత్ కీలక పాత్ర పోషించనుందని అభిప్రాయపడింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధిని 6.6శాతంగా అంచనా వేసినట్లు ఐఎంఎఫ్ డైరెక్టర్ జూలీ కోజాక్ పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో మూడో త్రైమాసిక వృద్ధి రేటు అంచనాల కన్నా బలంగా ఉన్నట్లు గమనించామన్నారు. దీంతో భవిష్యత్తు అంచనాలను సవరించే అవకాశం ఉందన్నారు. మరికొన్ని రోజుల్లో ప్రపంచ ఆర్థిక అంచనాల అప్‌డేట్‌లు విడుదల కానున్నాయని.. ఆ సమయంలో భారత్ వృద్ధి అంచనాలను సవరిస్తామన్నారు.







# లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. మార్కెట్ అంచనాలను మించి ఇన్ఫోసిస్ మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించడం, భవిష్యత్ అంచనాలను కూడా పెంచడంతో ఐటీ స్టాక్స్‌లో ర్యాలీ కనిపించింది. ఫార్మా, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఓ దశలో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా లాభాల్లోకి వెళ్లినా.. లాభాల స్వీకరణతో మోస్తరు లాభాలకే పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 83,670.79 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,382.71) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,134.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 187.64 పాయింట్ల లాభంతో 83,570.35 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 28.75 పాయింట్ల లాభంతో 25,694.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. ఎటెర్నల్, ఏషియన్ పెయింట్స్, బీఈఎల్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4610 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# 825 రోజులు కాదు.. 1,547 రోజులు..

## ఐసీసీ సోషల్ మీడియా పోస్ట్‌లో దొర్లిన తప్పు

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇటీవల ఐసీసీ ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో బ్యాటింగ్ విభాగంలో నం.1 ర్యాంక్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అతడు దాదాపు అయిదేళ్ల తర్వాత ఈ ఘనతను సాధించాడు. ఈ విషయాన్ని ఐసీసీ సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లో పేర్కొంది. అయితే అందులో విరాట్ కోహ్లీ మొత్తం మీద నం.1 స్థానంలో 825 రోజులు ఉన్నట్లు తెలిపింది. కానీ.. నిజానికి అతడు 1,547 రోజుల పాటు ఆ స్థానంలో కొనసాగాడు. ఈ విషయాన్ని గుర్తించిన పలువురు నెటిజన్లు, అభిమానులు ఐసీసీ మీద ఫైర్ అయ్యారు. అంత పెద్ద సంస్థ బాధ్యతారాహిత్యంగా తప్పుడు సమాచారంతో ఎలా పోస్ట్‌లు పెడుతుందంటూ విమర్శలు గుప్పించారు. దీంతో ఐసీసీ నష్టనివారణ చర్యలకు దిగింది. ఆ పోస్ట్‌ను డిలీట్ చేసింది. అలాగే విరాట్ కోహ్లీ నం.1 ర్యాంక్‌లో 1,547 రోజులు కొనసాగాడంటూ పేర్కొంది. ప్రస్తుతం కోహ్లీ ఖాతాలో 785 పాయింట్లున్నాయి. రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ బ్యాటర్ డరిల్ మిచెల్ ఖాతాలో 784 పాయింట్లున్నాయి. మూడో స్థానంలో రోహిత్ శర్మ 775 పాయింట్లతో ఉన్నాడు. ఇప్పటికే టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్.. వన్డేల్లో నిలకడగా రాణిస్తున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా 135, 102, 65 (నాటౌట్)తో అదరగొట్టాడు. తాజాగా న్యూజిలాండ్‌తో మొదటి వన్డేలో 91 బంతుల్లో 93 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. రాజ్‌కోట్‌లో జరిగిన రెండో వన్డేలో మాత్రం బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. కేవలం 23 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఆదివారం ఇండోర్ వేదికగా మూడో వన్డే జరగనుంది. సిరీస్ విన్నర్‌ను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో కోహ్లీ పెద్ద ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు.






# త్వరలో బంగ్లాదేశ్‌లో పర్యటించనున్న ఐసీసీ

ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ త్వరలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్‌తో బంగ్లాదేశ్‌లోనే సమావేశం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీని అనంతరం టీ20 వరల్డ్ కప్ 2026లో ఆ జట్టు పాల్గొనబోయే మ్యాచ్‌ల వేదికల మార్పు గురించి ఐసీసీ అధికారంగా తన తుదినిర్ణయం ప్రకటించే అవకాశమున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతకుముందు బీసీబీ, ఐసీసీ మధ్య మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ప్రస్తుతానికైతే.. టీ20 వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనబోయే అంశంపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. బంగ్లాదేశ్‌లో కొంతకాలంగా రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ దేశంలో వరుసగా హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ మినీవేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.9.20 కోట్లకు దక్కించుకున్న విషయమై విమర్శలు వచ్చాయి. దీంతో బీసీసీఐ ఆదేశాలతో కేకేఆర్ అతడిని రిలీవ్ చేసింది. ఈ పరిణామాల అనంతరం బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. టీ20 వరల్డ్ కప్ 2026లో తమ మ్యాచ్‌లను భద్రతా కారణాల రీత్యా భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్‌కు లేఖ రాసింది. అయితే ఐసీసీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో బీసీబీ నాలుగు సార్లు ఐసీసీకి ఈ విషయమై విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుంది. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ గ్రూప్ స్టేజిలో తన మ్యాచ్‌లను కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫిబ్రవరి 7న వెస్టిండీస్, 9న ఇటలీతో, 14న ఇంగ్లాండ్‌తో, 17న ముంబయిలోని వాంఖడే స్టేడియంలో నేపాల్‌తో ఆడాల్సిఉంది. మెగాటోర్నీ ప్రారంభానికి చాలా తక్కువ సమయమే ఉన్నందున వేదికల మార్పు సాధ్యం కాకపోవచ్చని ఐసీసీ.. బీసీబీకి సూచాయగా చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అయితే త్వరలోనే ఐసీసీ అధికారికంగా అసలు విషయాన్ని ప్రకటించే అవకాశముంది.

# రోహిత్ కెప్టెన్సీ కోల్పోవడం వెనుక ఆ ఇద్దరి పాత్ర..

## టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ




రోహిత్ శర్మ వన్డే కెప్టెన్సీ కోల్పోవడం వెనక బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ల పాత్ర ఉందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఆరోపించాడు. రోహిత్ శర్మ నాయకత్వంలో టీమ్ఇండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ.. రోహిత్‌ను సెలక్టర్లు కెప్టెన్సీ నుంచి తప్పించారు. ఆ బాధ్యతలను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని అధికారికంగా బీసీసీఐ చీఫ్ సెలక్టర్ హోదాలో అజిత్ అగార్కర్ ప్రకటించాడు. అయితే.. ఈ నిర్ణయం వెనక హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర కూడా ఉందని మనోజ్ తివారీ అభిప్రాయపడ్డాడు. 'అగార్కర్ సంచలన నిర్ణయాలు తీసుకోవడానికి సంకోచించడు. అయితే.. అతడి నిర్ణయం వెనక వేరొకరి పాత్ర కూడా ఉండొచ్చు. అగార్కర్ ఒక్కడే ఇంత పెద్ద సాహసం చేయడు. కోచ్ సూచనల ప్రకారమే చీఫ్ సెలక్టర్‌గా ఈ నిర్ణయం తీసుకుని ఉంటాడు. దీనికి ఇద్దరూ బాధ్యులే' అని మనోజ్ తివారీ ఓ క్రీడా ఛానల్‌తో అన్నాడు. టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్న కెప్టెన్‌ను తొలగించి, అతడి స్థానం లో కొత్త వ్యక్తిని సారథిగా నియమించడం సమంజసం కాదన్నా డు. అది రోహిత్‌ను అవమానించినట్లే అవుతుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. 'రోహిత్ శర్మ.. వన్డే వరల్డ్ కప్ 2027 ఆడటంపై వారికి సందేహాలు ఎందుకున్నాయో నాకు అర్థం కావడం లేదు. అతడి సామర్థ్యాన్ని అనుమానించడం పొరపాటు. రోహిత్ ఎవరికీ సాధ్యం కాని విధంగా వన్డే ఫార్మాట్లో మూడు డబుల్ సెంచరీలు బాదిన విషయాన్ని మరిచిపో కూడదు' అని అన్నాడు. అలాగే ప్రస్తుతం భారత తుది జట్టు ఎంపికలో లోపాలున్నాయని మనోజ్ తివారీ ఆరోపించాడు. 'ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోవడంలో చాలా అసమానతలున్నాయి. నేను వన్డే మ్యాచ్‌లపై ఆసక్తి కోల్పోయాను' అని పేర్కొన్నాడు.

# కనీసం మూడో మ్యాచ్‌లోనైనా అతడికి అవకాశం ఇవ్వాలి

## రవిచంద్రన్ అశ్విన్



మూడు వన్డేల సిరీస్‌లో టీమ్ఇండియా, న్యూజిలాండ్ 1–1తో సమంగా నిలిచాయి. వడోదర వేదికగా జరిగిన మొదటి మ్యాచ్‌లో టీమ్ఇండియా నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధిస్తే, రాజ్‌కోట్‌లో జరిగిన రెండో వన్డేలో కివీస్ జట్టు 7 వికెట్ల అంతరంతో గెలిచింది. సిరీస్ విజేతను నిర్ణయించే కీలకమైన మూడో వన్డే ఇండోర్ వేదికగా ఆదివారం (జనవరి 18) జరగనుంది. మొదటి రెండు మ్యాచుల్లో టీమ్ఇండియా ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌ను బెంచ్‌కే పరిమితం చేశారు. అతడిని కనీసం మూడో వన్డేలోనైనా తుది జట్టులోకి తీసుకోవాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా సూచించాడు. హర్షి త్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణకు మ్యాచ్ ప్రాక్టీస్ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'బౌలర్ల మధ్య తీవ్ర పోటీ ఉంది. ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాకు మ్యాచ్ ప్రాక్టీస్ అవసరం. దక్షిణాఫ్రికాతో మ్యాచుల్లో అయితే హిట్ ది డెక్ బౌలర్ అవసరం. అయితే న్యూజిలాండ్‌తో ఆ ఫార్ములా వర్కౌట్ కాదు. అందుకే అర్ష్‌దీప్‌సింగ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలి. అతడు ఇప్పటికే ఎంతో చేశాడు. కానీ ఇప్పటికీ అతడు జట్టులో స్థానం కోసం పోరాడుతున్నాడు. ఇలా ప్రతిసారీ బౌలర్ల విషయంలోనే జరుగుతోంది. బ్యాటర్ల విషయంలో మాత్రం కాదు' అని రవిచంద్రన్ అశ్విన్ ఒకింత గట్టిగానే తన వాదనను వినిపిం చాడు. 'నేను అర్ష్‌దీప్‌సింగ్‌కు ఎందుకు ఇంత మద్దతుగా నిలుస్తున్నానంటే.. అతడి చేతికి బంతి ఇచ్చిన ప్రతిసారీ అతడు చక్కటి ప్రదర్శన చేస్తున్నాడు. అందుకే అతడికి ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు కల్పించాలి. అతడికి ఆ అర్హత ఉంది. మొదటి రెండు వన్డేల్లో అర్ష్‌దీప్‌సింగ్‌ను ఎందుకు తప్పించారు. అది అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయదా?' అని అశ్విన్ ప్రశ్నించాడు.

# న్యూజిలాండ్ అంత తేలిగ్గా గెలవడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది

## టీమ్ఇండియా మాజీ క్రికెటర్

రాజ్‌కోట్ వేదికగా బుధవారం టీమ్ఇండియా, న్యూజిలాండ్ మధ్య రెండో వన్డే జరిగిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడిన టీమ్ఇండియా తొలుత బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. నిర్ణీత 50 ఓవర్లలో భారతజట్టు 7 వికెట్లు నష్టపోయి 284 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (112) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శుభ్‌మన్ గిల్ వరుసగా రెండో మ్యాచ్‌లో హాఫ్‌సెంచరీ (56) సాధించాడు. కానీ.. రోహిత్ శర్మ(24), విరాట్ కోహ్లీ(23), శ్రేయస్ అయ్యర్ (8), రవీంద్ర జడేజా (27), నితీశ్ కుమార్ రెడ్డి (20), హర్షిత్ రాణా (2) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. కేఎల్ రాహుల్ ఓపికగా చేసిన ఒంటరి పోరాటం వల్ల టీమ్ఇండియా ఆ మాత్రం ఫైటింగ్ టోటల్‌నైనా ప్రత్యర్థి జట్టు ముందు ఉంచగలిగింది. అయితే ఛేదనకు దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు అలవోకగా పరుగులు రాబట్టారు. ఓపెనర్లు డెవన్ కాన్వే (16), హెన్రీ నికోలస్ (10) విఫలమైనప్పటికీ డారిల్ మిచెల్ (131), విల్ యంగ్ (87) అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడారు. ముఖ్యంగా మిచెల్ అజేయ సెంచరీతో అలరించాడు. టీమ్ఇండియా అతికష్టం మీద చేసిన పరుగులను కివీస్ ఆటగాళ్లు మాత్రం ఆడుతూ పాడుతూ ఛేదించారు. కేవలం 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు నష్టపోయి 286 పరుగులు చేసింది. ఇది తనను ఆశ్చర్యానికి గురి చేసిందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ వాపోయాడు. 'న్యూజిలాండ్ చాలా తేలిగ్గా భారత్ విధించిన లక్ష్యాన్ని ఛేదించడం నన్ను నిజంగా ఆశ్చర్యానికి గురి చేసింది. వారు బ్యాటింగ్‌కు రావడానికి ముందు.. అందరూ టీమ్ఇండియాదే విజయం అనుకున్నారు. పిచ్‌లో ఉన్న మందకొడితనాన్ని భారత జట్టు తనకు సానుకూలాంశంగా మార్చుకుంటుందనుకున్నారు. కానీ అలా జరగలేదు' అని సునీల్ గావస్కర్ వివరించాడు. 'న్యూజిలాండ్ బౌలర్లు.. స్పిన్నర్లు మాత్రమే కాకుండా, సీమర్లు కూడా పిచ్‌లోని స్లోనెస్‌ను సద్వినియోగం చేసుకున్నారు. నేను నిజానికి టీమ్ఇండియా.. న్యూజిలాండ్‌ను 260 నుంచి 270 పరుగులలోపే కట్టడి చేస్తుందనుకున్నాను. చాలా అలవోకగా భారత్ ఈ మ్యాచ్‌లో గెలుస్తుందని భావించాను. కానీ న్యూజిలాండ్ జట్టు 300 పరుగుల లక్ష్యాన్ని కూడా ఛేదించేలా కనిపించింది' అని సునీల్ గావస్కర్ విశ్లేషించాడు.

# స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ ధరలకు త్వరలో రెక్కలు

స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ కొనే ఆలోచన ఉందా? అయితే మీ జేబులో బరువు కాస్త పెంచండి. రాబోయే రెండు నెలల్లో వీటి ధరలు పెరగనున్నాయి. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు పెరిగాయి. టీవీ బ్రాండ్లు సైతం ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థల నుంచి మెమొరీ చిప్స్‌కు ఎనలేని డిమాండే ఈ పరిస్థితి కారణం. గత త్రైమాసికంలో మెమొరీ చిప్స్ ధరలు ఏకంగా 50 శాతం మేరకు పెరగ్గా.. జనవరి–మార్చి త్రైమాసికంలో మరో 40–50 శాతం పెంపు ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏప్రిల్–జూన్‌లో మరో 20 శాతం వరకు పెరగొచ్చని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో వివో, నథింగ్ వంటి సంస్థలు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.3 నుంచి రూ.5 వేల వరకు పెంచాయి. శాంసంగ్ వంటి కంపెనీలు పరోక్షంగా ఖర్చులు తగ్గించుకోవడానికి క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్లను నిలిపివేశాయి. మెమొరీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఆ మేరకు ధరల పెంపు చేపట్టొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. తాము లాంచ్ చేయబోయే మోడళ్ల ధరలను పెంచనున్నట్లు నథింగ్ సీఈఓ కార్ల్ పై ఇప్పటికే స్పష్టంచేశారు. మరిన్ని బ్రాండ్లు ఇదే బాటలో నడవనున్నాయి. నవంబర్ – డిసెంబర్ నెలల్లో స్మార్ట్‌ఫోన్ ధరలు కనిష్ఠంగా 3 శాతం.. గరిష్ఠంగా 21 శాతం మేర పెరిగాయి. రాబోయే రోజుల్లో మరో 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక్క స్మార్ట్‌ఫోన్లే కాదు.. టీవీలదీ అదే పరిస్థితి. తాము ఆర్డర్ చేసే మెమొరీ చిప్స్‌లో కేవలం పదో వంతు మాత్రమే తమకు అందుతున్నాయని కోడక్, థామ్సన్ వంటి బ్రాండ్లపై టీవీలను విక్రయించే సూపర్ ప్లాస్ట్రోనిక్స్ సంస్థ పేర్కొంది. మెమొరీ చిప్స్ కొరతను ఈ పరిస్థితి తెలియజేస్తోంది. ఇప్పటికే టీవీల ధరలు పెంచామని, ఫిబ్రవరిలో మరో 4 శాతం మేర పెంచాలనుకుంటున్నట్లు ఆ కంపెనీ సీఈఓ అవనీత్ సింగ్ 'ఎకనమిక్ టైమ్స్'కు వెల్లడించారు. ల్యాప్‌టాప్ ధరలు ఇప్పటికే 5–8 శాతం మేర పెరగ్గా.. మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.



# వాకీ టాకీ విక్రయాలు..

## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషోకు జరిమానా

**న్యూఢిల్లీ :** చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ–కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ–కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0–446.2 మెగాహెర్ట్జ్ కాదు, వీఎఓ బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో, జియో మార్ట్ తదితర ఈ–కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు జబ్రూగా తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున ఫైన్ వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com